# మిసిమి

మాస పత్రిక

జులై- 2004



రూ. 8/-



పాబ్లో పికాసో

(1881 - 1973)

(వ్యాసం 279వ పేజీ)



ఎద్దుతో పోరాట దృశ్యం (1955)



విశ్రాంతి తీసుకొంటున్న నాగ్నిక (1973)

పికాసో చివరి చిత్రం

# మిసిమి

"All that we are is the product of what we have thought"
is "We are what we think." - Dammapada.

సంపుటి 15 | జులై 2004 | సంచిక 7

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక


జియొసు కార్డుచ్చి — మూలం : సి.డి.ఆఫ్ విర్సెన్, అనువాదం: బి.వి.రామిరెడ్డి

నగల నిగనిగలు - కలం వగవగలు — డా॥ పెదపాటి నాగేశ్వర రావు

ప్రాచీన కన్నడ స్త్రీ సాహిత్యం — డా॥ కె. ఆషాజ్యోతి

తల్లులు - పిల్లలు — వింజనంపాటి రాఘవరావు

యుద్ధ భేరీపై నిరసన పత్రం — కాంద్రేగుల నాగేశ్వరరావు

సమసమాజంలో మానవాత్మ — మూలం : ఆస్కార్ వైల్డ్, అనువాదం : సర్దేశాయి తిరుమల రావు



విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **గుయెర్నికా (1937)**

చిత్రకారుడు : **పాబ్లో పికాసో**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# గుయెర్నికా విజయం

- అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

పాబ్లోపికాసో చిత్రాలను మిసిమి ఇప్పటికే రెండుసార్లు వేసింది. మొదట్లో మిసిమి వ్యవస్థాపక సంపాదకులు డా॥ ఆలపాటి రవీంద్రనాథ్ ప్రచురించారు. ఆ తరవాత ప్రస్తుత సంపాదకులు 2001 ఫిబ్రవరి మిసిమి ముఖచిత్రంగా 'గుయెర్నికా' ను వేశారు. ఈ చిత్రాన్ని ఎన్నిసార్లు వేసినా వేయమంటుంది. దాని స్ఫూర్తి, ఉద్దీపన, ప్రపంచం దౌర్జన్యం 'Thonatos' మీద దాని వ్యాఖ్యానం అటువంటిది. ఈ చిత్రాన్ని మొదటిసారి ప్రదర్శనలో పెట్టి ఈ నెల 1వ తేదీకి 67 సంవత్సరాలు. ప్రపంచ మానవాళి నాగరికతలో ఎగిసిన విషకీలాగ్నుల ముఖం మీద 'ఉమ్మి'వేయాలన్నంత రోతను, అసహ్యాన్ని, జుగుప్సను ఈ చిత్రం ప్రదర్శిస్తుంది. పాల్ ఈలార్డ్ అనే స్పానిష్ కవి 'గుయెర్నికా విజయం' అనే కవితను రాసి ఈ చిత్రానికి అంకితమిచ్చాడు.

1

పొలాల, గనుల, గుడిసెల
సుందర ప్రపంచం

2

మంచి ముఖాలు అగ్నిలో
మంచి ముఖాలు చలిలో
చీత్కారాలలో, రాత్రులలో
బూతుల్లో, దెబ్బల్లో

3

ప్రతివిషయానికి ముఖాలు మంచివే
ఇదిగో నీ వంక చూస్తున్న శూన్యం ఇక్కడ ఉంది
నీ మృత్యువే ఒక ఉదాహరణ

4

వెనక్కు విసరిన హృదయమే మృత్యువు

5

అవి రొట్టె కోసం నీ నుంచి వసూలు చేశాయి
ఆకాశం, భూమి, నీరు, నిద్ర
ఇంక నీ జీవిత బాధ

6

మంచి మనస్సులు కావాలన్నారు వారు తమకు
అవి బలవంతుల పరిమితించి, మూర్ఖుల
మూల్యాంకనం కట్టారు
దానాలిచ్చాయి, పైసను సగం చేశారు
వారు శవాల ముందు మోకరిల్లారు
సభ్యతలో పోటీ పడ్డారు

7

వారు గోపనం చేస్తారు, అతిశయం చేస్తారు
వారు మన ప్రపంచానికి చెందిన వారు కారు

8

ఆడవాళ్ళకు పిల్లలకు ఉంది ఒకే సంపద
అది వసంత హరిత పత్రశోభ, శుద్ధ ధవళక్షీరం
ఇంకా కాలం - వారి విమల నేత్రాలలో

9

ఆడవాళ్ళకు పిల్లలకు ఉంది ఒకే సంపద
వారి నేత్రాలలో
మగవారు తమకు చేతనైనంతగా దానిని రక్షిస్తారు

10

ఆడవాళ్ళ, పిల్లల, నేత్రాలలో అరుణారుణ
రోజా పుష్పాలున్నాయి
ప్రతి ఒక్కటి దానిదైన రక్తాన్ని ప్రదర్శిస్తుంది

11

జీవన మరణాల భీతి ధైర్యాలు
మృత్యువు అంత కష్టం అంతే తేలిక

12

మొగుళ్ళు- ఎవరికోసం ఈ సంపద గావింప
బడిందో
మొగుళ్ళు- ఎవరికోసం ఈ సంపద వృథా అయిందో

13

నిజమైన మగవారు- ఎవరికోసం నిస్పృహ
కబళించే ఆశావహ అగ్నికి ఆహుతి అయిందో
మనమంతా ఒకటిగ భవితవ్య మొగ్గను తెరుద్దాం

14

వెలివారు, మృత్యువు, నేల, మన శత్రువుల
దారుణ వికారాలకు
విసుగుట కలిగించే మన 'రాత్రి రంగు' ఉంది
మనం వాటిని జయిస్తాం.

(స్పానిష్ నుంచి ఆంగ్లానికి, ఆంగ్లం నుంచి తెలుగుకు అంటే మూలానికి ద్విగుణ వ్యవహితం (twice removed from the original). అదీ కాక ఘనవాద ఛాయలతో రాసిన కవిత. అర్థం కావడం కష్టమే. అర్థం కన్నా అది రేకెత్తించే సంవేదన ముఖ్యం. - సం.)

# జియొసు కార్డుచ్చి

## (1906వ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారోపన్యాసం)

మూలం : సి.డి. ఆఫ్ విర్సెన్ అనువాదం: బి.వి.రామిరెడ్డి

శాశ్వత కార్యదర్శి, స్వీడిష్ అకాడెమి.

ఎందరో కవులు, రచయితల నుండి ఈ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారానికి ప్రఖ్యాత ఇటాలియన్ కవి జియొసు కార్డుచ్చి ఎంపిక చేయబడ్డాడు. ఈ కవి మా అకాడెమి సభ్యులదే కాక ప్రపంచ ప్రజల మన్ననలను పొందాడు.

ప్రాచీన కాలం నుండీ ఉత్తరాదివారు ఇటలీ యొక్క చరిత్ర, కళాఖజానాల వల్ల ఆకర్షితులౌతూనే వున్నారు. వారు రోమ్‌ని దర్శించందే ఉండలేరు. రోమ్ చేరుకోకముందే ఇటలీలోని ఎన్నో సుందర ప్రదేశాలు వారిని ఆకర్షిస్తాయి. వాటిలో అప్పెనిస్‌లోని బోలోనా పట్టణం ఒకటి. ఈ పట్టణానికి చెందినవాడే ''సాంగ్స్ ఆఫ్ ఎన్జో'' వ్రాసిన కార్ల్ ఆగస్ట్ నికాండర్.

మధ్య యుగాలనుండీ బోలోనా విశ్వవిద్యాలయం ఇటలీ యొక్క సాంస్కృతికచరిత్రలో ప్రాధాన్యత వహించింది. ప్రస్తుతం అది కవిత్వంలో అద్భుతాలను సృజిస్తోంది. ఈ పట్టణానికే చెందిన జియొసు కార్డుచ్చికి ఈ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కార ప్రదానం జరగబోతున్నది.

కార్డుచ్చి వాల్ డి కాస్టెల్లోలో 1835, జులై 27న జన్మించాడు. తన బాల్యానికి, యౌవనానికి సంబంధించిన అనుభవాలను, అనుభూతులను ఆయన తన ఆత్మకథలో వివరించాడు. ఆయన తండ్రి డా॥ మైఖేల్ కార్డుచ్చి కార్బొనీరియా పొలిటికల్ సొసైటీలో సభ్యుడు. ఆయన ఇటలీ విముక్తి కోసం కృషి చేశాడు. ఆయన తల్లి తెలివైనది, వ్యక్తిత్వంగల స్త్రీ. మైఖేల్ డాక్టర్ ఇన్ కాస్టెగ్నెటొ పదవిని పొందాడు. ఈ కవి తన బాల్య, యౌవనాలను టస్కన్ మరెమ్మాలో గడిపాడు. తన తండ్రి దగ్గరే లాటిన్ భాషను నేర్చుకున్నాడు, లాటిన్ సాహిత్యాన్ని అధ్యయనం చేశాడు. తరువాత కాలంలో మన్జొని కవి కవిత్వంతో, అభిప్రాయాలతో విభేదించినా, అతని కవిత్వం వల్ల, తండ్రికి ఆ కవి పట్ల వున్న ఆరాధన వల్ల ప్రభావితుడయ్యాడు. ఈ కాలంలోనే 'ఇలియడ్'ని 'ఏనియాడ్'ని, టాస్సొ రచించిన 'జెరూసలేం'ని, రోల్లిన్ రచించిన రోమన్ చరిత్రను, ఫ్రెంచి విప్లవంలో వారి పాత్రను గురించి చదివాడు. అది రాజకీయపు వొత్తిళ్ళ కాలం. ఈ యువకుడు కూడా వారి ప్రభావం వల్ల కొద్దిగా విప్లవ వాది అయ్యాడు. తన సోదరులు, మిత్రులతో రిపబ్లిక్స్ ఆట ఆడేవాడు; దెబ్బలాడేవాడు. సీజర్‌పాత్రధారిని రాయితో కొట్టాడు.

1840లో వీరి కుటుంబం ఫ్లోరెన్స్‌కు మారింది. అక్కడ కార్డుచ్చి ఒక కొత్త స్కూలులో చేరాడు. ఇక్కడే లియొపార్డి, స్కిల్లర్, బైరన్ కవితల్ని చదివాడు. కవిత్వం వ్రాయడం ప్రారంభించాడు. చదువు పూర్తయ్యాక సాన్‌మియాటోలో కవిత్వోపాధ్యాయుడయ్యాడు. అతని విప్లవ భావాలవల్ల అరెజ్జొ ఎలిమెంటరీ స్కూలులో ఉద్యోగం రాకుండా పోయింది. తరువాత పిస్టోయియాలోని లిసియంలో గ్రీకు ఉపాధ్యాయుడయ్యాడు. చివరకు బోలోనా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరయ్యాడు. అయినా అతని జీవితంలో సంఘర్షణ లేకపోలేదు. కొంతకాలం ఉద్యోగం నుండి తొలగింపబడ్డాడు. ఎందరో

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థా ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

రచయితలతో గొడవపడ్డాడు. వ్యక్తిగతంగా ఎన్నో విషాదాలనుభవించాడు. అతని సోదరుడు దాంతె ఆత్మహత్య చేసుకున్నాడు. అతని సాంసారిక జీవితం అతణ్ణి వీటన్నిటినుండి కాపాడింది.

ఇటలీ స్వతంత్రం అతని రచనను ఎక్కువ ప్రభావితం చేసింది. కార్డుచ్చి గొప్ప దేశ భక్తుడు. స్వాతంత్ర్య పోరాటాన్ని హృదయపూర్వకంగా ఆహ్వానించాడు. అందులోని పరాజయాలను, ప్రభుత్వ లోపాలను అతడు భరించలేకపోయేవాడు. ఇటలీ ఐక్యతకు భంగం కలిగించేవాటిని సహించ లేకపోయాడు. వెంటనే ఫలితాలను ఆశించడం అతని స్వభావం.

కవిగా అతడు తనస్థానాన్నాక్రమించడం ప్రారంభించాడు. చారిత్రక, సాహిత్య విమర్శకుడిగా అతనికి గుర్తింపు లభించింది. కాని కవిగానే సుప్రసిద్ధుడయ్యాడు. 1863లో ప్రచురించిన ''జువెనిలియా'' లో కావ్య లక్షణాలు, దేశభక్తి, కాథలిక్ చర్చిమీద అసహ్యత కనబడతాయి. అతడు తన పాటలలో ప్రాచీన రోమ్ యొక్క స్మృతుల్ని, ఫ్రెంచి విప్లవం, గారి బాల్డి, మాజినిలను గుర్తు చేస్తాడు. ఈ సంకలనంలో కొన్ని మంచి రచనలున్నాయి. అలాంటి వాటిలో 1859లో విక్టర్ ఇమ్మాన్యుల్ మీద వ్రాసిన రచన ముఖ్యమైనది. అతని ''మాగ్నెటా'' నిజమైన దేశభక్తికి ప్రతీక. 1868లో రచించిన ''లైట్ అండ్ హెవీ'' లోని కొన్ని గీతాలలో విషాదం ధ్వనిస్తుంది. ఆనాటి రాజకీయాలను అతడు గట్టిగా నిరసించాడు. ఇందులో కొన్ని అందమైన కవితలున్నాయి. కార్డుచ్చికి 14వ శతాబ్దపు కవిత్వంపై మంచి అవగాహన వుంది.

1877లో వెలువడ్డ ''న్యూ రైమ్స్'', ''ది బార్బేరియన్ ఓడ్స్''తో కవిగా కార్డుచ్చి పరిపక్వత సాధించాడు. ఈ కవితలలో సౌందర్యం, ఆనందం వెల్లివిరిశాయి. ఇదే సంకలనంలోని ''ది రెబెలియన్'' అనే భాగం అనేకసానెట్ల సమాహారం. ఇది ఫ్రెంచి విప్లవం గురించి కార్డుచ్చి హృదయావిష్కరణ. ''ది బార్బేరియన్ ఓడ్స్'' మూడు ముద్రణలు పొందింది. కార్డుచ్చి ప్రాచీన ఛందస్సులుపయోగించినా, వాటిని ఆధునీకరించాడు. వీటిలో చాలా ఓడ్స్ కవితా శిఖరాల్నందుకున్నాయి. 1898లో రచించిన ''రైమ్స్ అండ్ రైమ్స్'' లో మహారాణి ఎలిజబెత్ విధిని వర్ణించాడు. కార్డుచ్చి కవిత్వంలో ఎన్నో ద్వంద్వ లక్షణాలున్నప్పటికి ప్రపంచ సాహితీ మూర్తుల్లో ఒకనిగా కార్డుచ్చిని గౌరవిస్తారు.

అతనిలోని రిపబ్లికన్ లక్షణాలను, రాజకీయాభిప్రాయాలను ఎవరూ కాదనలేరు. సంవత్సరాల అనుభవంతో ఇటాలియన్ జాతి ఇటాలియన్ స్వాతంత్ర్యాన్ని కాపాడుకుంటుందని గ్రహించాడు. కార్డుచ్చి ఇటలీ రాణి మాత - మార్గరిటాకు ఒక కవితను అంకితమిచ్చాడు. అది ''టు ద క్వీన్ ఆఫ ఇటలీ''. అతని మిత్రులు, రాజకీయవాదులు అతణ్ణి వ్యతిరేకించడానికి ప్రధాన కారణం అతని వ్యక్తిగత విమర్శలు కాదు. క్రైస్తవం మీద అతని విమర్శ. అతనికి క్రైస్తవం మీద వున్న వ్యతిరేకత అతని ''హిమ్ టు శాటన్'' లో చూడవచ్చు. కార్డుచ్చి క్రైస్తవ వ్యతిరేకత మీద ఎందరో దాడి చేశారు. దాన్ని మనం అర్థం చేసుకోగలం. దేశ భక్తుడిగా కాథలిక్ చర్చి ఇటలీ స్వాతంత్ర్యానికి అవరోధం కావడాన్ని అతడు సహించలేకపోయాడు. అయితే, అతని కవితల్లోని మతాభినివేశాన్ని మనం మర్చిపోరాదు.

1865లో కార్డుచ్చి వెలువరించిన ''హిమ్ టు శాటన్''తో అతణ్ణి బోదిలేర్‌తో పోల్చడం సరికాదు. కార్డుచ్చి ఎన్నుకొన్న 'శాటన్' సరైన పేరు కాదు. ఇక్కడ శాటన్‌ని ''లూసిఫర్''గా గ్రహించాలి. లూసిఫర్ తేజశ్చోదకుడు, స్వేచ్ఛాపూరితమైన ఆలోచనకు ప్రతీక, సంస్కృతికి చిహ్నం; ప్రకృతి స్వేచ్ఛకు వ్యతిరేకమైన సాధుక్రమశిక్షణకు వ్యతిరేకి. ఈ గ్రంథం ద్వంద్వాలతో నిండి వుంది. కార్డుచ్చి ఈ మధ్యనే తన ఈ కవితను నిరసించుకున్నాడు.

కార్డుచ్చి విజ్ఞుడైన సాహితీ చరిత్రకారుడు. అతడు రోమాంటిసిస్టుకాడు, పెట్రార్క్-న్‌హ్యూమనిస్టు. అతడు ఎప్పుడూ జాతీయవాది, స్వేచ్ఛను ప్రేమించాడు. అవసరంకోసం తన అభిప్రాయాలను మార్చుకోవడమో, అమ్ముకోవడమో చేయలేదు. అతడు సౌఖ్యవాది కాడు, ఎప్పుడూ ఉన్నత ఆదర్శాల కోసం తపించాడు. అతడు నిస్సంశయంగా నోబెల్ సాహితీ పురస్కారానికి అర్హుడు. స్వీడిష్ అకాడెమి ప్రపంచ ప్రసిద్ధుడైన, అనేక పురస్కారాలందుకున్న ఈ కవిని గౌరవిస్తున్నది. ఇటలీ కార్డుచ్చిని సెనెటర్‌గా ఎన్నుకున్నది. ఆ విధంగా తన ఔన్నత్యాన్ని చాటిన ఈ కవిని గౌరవించుకున్నది.

పురస్కార సందర్భంగా, అనారోగ్య కారణాలవల్ల పురస్కారాన్నందుకునేందుకు రాలేకపోయిన కార్డుచ్చిని గురించి సి.డి.ఆఫ్ విర్సెన్ ఇటాలియన్‌లో మాట్లాడారు. ఆయనకు ప్రతినిధిగా పురస్కారాన్నందు కునేందుకు వచ్చిన ఇటాలియన్ డి అఫైర్స్, కౌంట్‌కాప్రిర - నోబెల్ సాహితీ పురస్కారం ద్వారా స్వీడన్ తమ దేశాన్ని గౌరవించిందని, తమ దేశపు అత్యున్నత పుత్రుణ్ణి ఆదరించిందని అన్నారు. ఆయన ఫ్రెంచి భాషలో ఆల్ఫ్రెడ్ నోబెల్‌కు, స్వీడన్‌కు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

**జీవిత చరిత్ర :**

జియొసు కార్డుచ్చి (1835-1907) పిసాలోని చిన్న బస్తీ - వాల్‌డి కాస్టెల్లోలో జన్మించాడు. చిన్నతనంలో రోమన్, గ్రీకు కవులవల్ల ప్రభావితుడయ్యాడు. ఇటాలియన్ క్లాసిక్సు, డాంటె, టస్సో ఆల్ఫిరిలను అధ్యయనం చేశాడు. ఇరవయ్యేళ్ళ వయసులో పిసా విశ్వవిద్యాలయం నుండి తత్వశాస్త్రంలో పట్టా పుచ్చుకున్నాడు. ఎన్నో సంవత్సరాలు కష్టాల నెదుర్కొని, ఉపాధ్యాయుడిగా పని చేసి బోలోనా విశ్వవిద్యాలయంలో ఇటాలియన్ ప్రొఫెసరుగా నియమితుడయ్యాడు.

తనకాలం, తన పఠనంతో ప్రభావితుడై, చిన్న వయసులోనే కవితా రచన ప్రారంభించాడు. అతని మొదటి రెండు కవితా సంకలనాలు - ''రైమ్స్'' 1857, ''లైట్ అండ్ హెవీ'' 1868. ఇవి తన ప్రాచీనులకు అనుకరణలైనా వాటిలో విప్లవ భావాలున్నాయి. ''హిమ్ టు శాటన్'' (1865)లో శాటన్‌ను పొగిడాడు. దీనిలో అతని స్వేచ్ఛా ఆలోచనా ధోరణి, ఆధునికత, స్రష్టత్వం, విప్లవ వాదం కనుపిస్తాయి. 1882లో రచించిన ''ఇయాంబిక్స్ అండ్ లవ్ ఓడ్స్'' వ్యంగ్య కవితా సంకలనం. ఇందులో తన సమకాలీనుల మీద అసహనం కనిపిస్తుంది. ''న్యూ పోయెమ్స్'' 1873, ''బార్బేరిక్ ఓడ్స్'' 1877, లలో అతని కవిత్వం పరిపక్వత చెందింది.

కార్డుచ్చి మంచి అనువాదకుడు కూడాను. గెథె గీతాలు, హెయిన్ గేయాలు అతడి కవిత్వాన్ని ప్రభావితం చేశాయి. కవిగానే కాక కార్డుచ్చి సాహితీ చరిత్రకారునిగా, ఉపన్యాసకుడిగా సుప్రసిద్ధుడు. అతడు సాహిత్యంలోని అన్ని దశల మీద పరిశోధన సాగించాడు. ఫలితం - ''లిటరరీ స్టడీస్'' 1874, ''క్రిటికల్ స్కెచెస్ అండ్ లిటరరీ డిస్కషన్స్'' 1876.

కార్డుచ్చి రాజకీయాలలో చురుగ్గా పాల్గొన్నాడు. బోలోనాకు గౌరవ సభ్యుడిగా ఎన్నుకోబడ్డాక 1890లో సెనేట్‌కు ఎన్నుకోబడ్డాడు. ''హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్'' కు కొద్దికాలం డిప్యూటీగా వున్నాడు. ఇటాలియన్ స్వాతంత్ర్య పోరాటంలో అతని కవిత్వం దేశభక్తుల్ని ఉత్తేజితుల్ని చేసింది. అతడు అందరి గౌరవ మన్ననలకు పాత్రుడయ్యాడు. అతడు పండితుడు, స్రష్ట, 19వ శతాబ్దపు ఇటాలియన్ సాహిత్యాకాశంలో ధ్రువతార.

# నగల నిగనిగలు - కలం వగవగలు

## అనే పరిశోధనా నిబంధం యొక్క సారసంగ్రహ రూపము

– డా॥ పెదపాటి నాగేశ్వర రావు

సంఘంలో ఉన్న జనుల మనోభావాల వ్యక్తీకరణకు సాంద్ర రూపమైన సాహిత్యంలో సంస్కృతీ - నాగరికతలు ప్రతిబింబించి ఉంటాయి. నాగరికత పుట్టిన నాటి నుండి సమాజంలో సాహిత్యానికి అగ్రతాంబూలం చెల్లుతూనే ఉంది. అతి సామాన్య జీవనం గడిపిన శుద్ధ సత్వ జన సముదాయమే ఈ సాహిత్యాన్ని శిల్పీకరించి ప్రతిపదంలోను శాంతిని నింపింది. ఆశ్రమాలు, కుటజాలు, తరుచ్ఛాయలు, మహావృక్షాల నీడన సరస్సుల ప్రక్కన, జలపాతాల సన్నిధిలో, కీకారణ్యాల వాడిలో, సాధు జంతువుల మధ్య నివసించిన ఆర్యజీవుల చిత్రాలే ఆదిమ భారతీయ సాహిత్యంలో దర్శనమిచ్చే సుందర దృశ్యాలు. ప్రశాంత నిలయాలైన ఆనాటి వారి హృదయకేదారాలలో సహజ శీతలతలు ప్రతి ఫలించి ఉన్నయ్. ఆ యుగంలో వచ్చిన సాహిత్యంలో ప్రకృతి సోయగాలతో బాటు వీర మానవ దార్ఢ్యం కూడా కనిపిస్తుంది. వారి మధ్య ఉన్న ప్రకృతి సౌందర్యానికి పులకితులై పాడిన పాటలున్నయ్. క్రమేపీ సరస్వతీ నదీతీరాన నగర జీవనం విస్తరించింది. అలంకార శోభితమైన భాషా సాహిత్యాలు పెరిగినై. క్రమేపీ ప్రశాంత జీవనం తగ్గి గజిబిజి నగర జీవనం ప్రారంభమైంది. ప్రకృతి వనరుల దుర్వినియోగంలో పర్యావరణం ప్రదూషితమవజొచ్చింది. ఈ దృశ్యాలన్నీ మన ప్రాచీన సాహిత్యంలో ఉన్నై.

తామరలు, కమలాలు, గులాబీలు, మల్లెలు, మొల్లలు ఎక్కడ చూచినా దర్శనమిచ్చేవి. వాటి కాంతులే ఆనాటి స్త్రీల కపోలాలపై తళతళలీనుతుండేవి. కందమూల ఫలాల రూపాలన్నీ పురుష ముఖ సౌందర్యంలో దర్శనమింస్తుండేవి. రానురాను సమాజం తాము ధరించే వస్త్రం, ఆభరణం, నివాసాల మీద ఈపువ్వుల, ఫలాల, లతల, వృక్షాల చిత్రాలనే అలంకరించుకోవడం చూడవచ్చు. ప్రకృతి ఒడిలో పెరిగిన మానవుడు అప్రయత్నంగా తను సృష్టించిన సాహిత్యం నిండా ప్రకృతి సౌందర్యాన్నే నింపాడు. ఈ దేశంలో ఉన్న అన్ని భాషా సాహిత్యాల్లోనూ ఇది ప్రతిఫలించి ఉన్నది. కళా రూపాలేవీ ప్రకృతి సౌందర్యాన్ని విడవలేదు. సౌందర్య పిపాసువులైన వారందరికి ప్రకృతితో గల సంబంధం వివిధ రూపాల్లో నిలిచింది. ప్రకృతి సౌందర్యం మానవ మనోఫలకంపై నిలిచి భాషా సాహిత్యాల్ని పరిపుష్టం చేసింది. సాహిత్య హేమా హేమీలు ఎలా ఈ చిన్న చిన్న సౌందర్య గ్రంధులకు ముగ్ధులై తమ గ్రంథాల్లో నిబిడీకృతం చేశారో వివరించే ప్రయత్నమే ఈ వ్యాసం.

వేలాది పాత రాతి యుగాలు, కొత్త రాతి యుగాలు గడిచి లోహాల్ని కనుగొని ప్రాకృత జీవన యానంలో మానవుడు మరో అడుగు ముందుకు వేశాడు. అలా పెరిగిన మానవుణ్ణే సంస్కారాల పేరుతో వంచి వస్త్రాభరణ, నివాస సౌఖ్యాలు కల్పించి సంఘజీవనం నేర్పడం జరిగింది. మతం, కులం, ప్రాంతీయ, భాషా పరమైన విభజనలతో మానవుడు పెరిగాడు. ఈ పరిణామాలన్నీ భారతీయ సాహిత్యంలో ప్రతిఫలించినై.

భారతీయ సాహిత్యమనే మహా వృక్షానికి ఇరవైకి పైగా శాఖలున్నై. సంస్కృత ప్రాకృత పాలీ ఇత్యాది భాషలు ప్రాచీన కాలంలో ఈ వృక్షాన్ని పెంచినై. బుద్ధ, శంకర, రామానుజ, కబీర్, తులసీ, సూర్దాస్,

తుకారాం లాంటి సాధుపురుషులు; వ్యాస, వాల్మీకాది రుషులు దీన్ని పోషించారు. సంఘం, సాహిత్యం, మతం, వేదాంతం, మనోవిజ్ఞానం, చరిత్ర మొదలైన విషయాలన్నీ ఈ భారత ఖండ సాహిత్యంపై చెరగని ముద్రవేసినై. ఆర్య, ద్రావిడ, పరిషియన్, అరబిక్, క్రిస్టియన్, ముస్లిమ్, చైనీస్, మంగోలియన్, టిబెటన్, యూరోపియన్ సాంస్కృతిక సమ్మేళనంతో ఇది ఒక మహాసముద్రంలా తయారై ఈ సాహిత్యాన్ని సృష్టించింది. ఈనాటి భారతదేశంలో హిందీ, తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, మహారాష్ట్ర, గుజరాతీ, బెంగాలి, ఒరియా, ఆసామి, పంజాబీ, కాశ్మీరి భాషలతో బాటు కొంకణి, మైథిలి, నేపాలి లాంటి చిన్న చిన్న భాషలతో ఆధునిక సాహిత్యం వర్ధిల్లుతుంది.

మధ్యయుగంలో తలెత్తిన ప్రాంతీయ భాషలన్నింటిలోనూ అరబిక్, పరిష్యన్, యూరోపియన్, భాషల, సంస్కృతుల ప్రభావం వుంది. ఆధునిక భారతీయ సాహిత్యం ఆంగ్ల సాహిత్య ప్రభావంతో సుసంపన్నమై వుంది.

వివిధ భాషా సాహిత్యాల తులనాత్మక అధ్యాయనమనేది మన విశ్వవిద్యాలయాలలో కొత్తగా చేరిన శాఖ. దీంట్లో ఆధునిక భారతీయ సాహిత్య స్వరూప స్వభావాల అధ్యయనం జరుగుతోంది. దీని ద్వారా ఎన్ని విషయాలు జీర్ణమైనాయి ఎన్ని వదిలిపెట్ట బడినాయి అనే పరిశోధన కొనసాగుతోంది. ఇప్పుడు ప్రస్తుతమయ్యే వ్యాసంలో మన భారతీయ సాహిత్యంలో ఆభరణాల పాత్ర అనే చర్చ ద్వారా కళ - సౌందర్యం - తత్వం - మానవ ప్రకృతి - చరిత్ర - సమాజం - భారతీయతల దృశ్యాలు తెలియ జేయబడతాయి. దీంతో బాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, మరాఠీ సాహిత్యాల లోతులూ తెలియజేయడం జరుగుతుంది.

వ్యాసంలో భారతీయ సాహిత్యంలో ఆయా భాషలలో వెలువడ్డ మహాకావ్యాలలో ఆభరణాల ప్రాశస్త్యం ఏమిటో వివరించడం జరుగుతుంది. ఈ క్రింది పట్టికకేవలం ఒక ఉదాహరణాత్మకసూచిక మాత్రమే (పూర్ణ వివరాలు ప్రాజెక్టు సంపూర్ణ నివేదికలో వివరింపబడతాయి.)

| సంఖ్య | ఆభరణం పేరు | దాని సాహిత్య విశేషము |
|---|---|---|
| 1. | కాలి అందె | శిలప్పదికారం అనే తమిళ కావ్యం - ఇళంగో వ్రాసిన దానిలో ప్రధాన పాత్ర పోషించిన నగ. |
| 2. | ఉంగరం | అభిజ్ఞాన శాకుంతలం అనే సంస్కృత నాటకంలో కాళిదాసు ఉంగరం పాత్ర వివరించాడు. |
| 3. | చెవి కమ్మ | తెలుగు కవి నన్నయ మహాభారతం ఉదంకోపాఖ్యానంలో వివరించిన ఆభరణ విశేషం. |
| 4. | కంఠాభరణం | మరాఠీ భక్తకవి నరహరి తన అభంగాల్లో స్వామి నగలు వర్ణించాడు. |
| 5. | పాదుక | ఈ ఆభరణాన్ని భరతమిలన్‌లో మహాకవి తులసిదాసు వర్ణించాడు. |
| 6. | మాంగల్యం | తెలుగు కావ్యం శంభుదాసుని హరిశ్చంద్ర చరిత్రలో మాంగల్యం యొక్క మహిమ వర్ణించాడు. |
| 7. | మణి | శ్యమంతకోపాఖ్యానంలో శ్యమంతకమణి ప్రధాన వస్తువు. |

| | | |
|---|---|---|
| 8. | మణిమాల | పింగళి సూరన కళాపూర్ణోదయమనే కావ్యంలో మణిహారం హృదయానికి తాకడంతో పూర్వజన్మ స్మృతి కలగడం వర్ణింపబడి కథా సూత్రం విప్పడం జరుగుతుంది. |
| 9. | చూడామణి | రామాయణ కల్పవృక్షంలో విశ్వనాథ సత్యనారాయణ సీతయొక్క చూడామణిని హృదయంగమంగా వర్ణించాడు. |
| 10. | అద్దం | కాంచీపురాణం అనే కన్నడ కావ్యంలో అద్దం ప్రభావం కథకు ముఖ్య సూత్రంగా వర్ణింప బడింది. బొమ్మకంటి ప్రభాకర కవి తెలుగులో ధర్మపాల విజయంగా వ్రాశాడు. |
| 11. | మణిమేఖల | జీవక చింతామణి - కుండలకేశి - అనే ప్రాచీన తమిళ గ్రంథాలలో ఆభరణాల ప్రాధాన్యం ఉన్నది. |
| 12. | కంకణాలు | శ్రీనాధ మహాకవి - రచనలలో చూడవచ్చు. |
| 13. | కిరీటం | మకుటం / తలపాగలు శ్రీనాధాది కవుల చాటువులలో చూడ వచ్చు. |
| 14. | భుజకీర్తి | బాహువలయం / దండకడియములు - ప్రాచీన కావ్యాలలో పురుషులు ధరించే ఆభరణాలుగా వర్ణింపబడ్డాయి. |
| 15. | నాసామణి | బులాకీ / నత్తు - ప్రాచీన పద్యాలలో శంకరాచార్యుని స్తోత్రాలలో స్త్రీలు ముక్కుకు ధరించే ఆభరణంగా వర్ణింపబడినది. |
| 16. | కటిసూత్రం | పురుషులకు మొలత్రాడుగా ప్రాచీన కావ్యాలలో వర్ణింపబడినది. |
| 17. | ఉదర బంధం | అన్నమయ్య కీర్తనలలో పురుషాలంకారముగా వర్ణింపబడినది. |
| 18. | ఆభరణాల వరసలు | శ్రీనాధుని కాశీఖండంలో గురుపత్ని తన శిష్యుని తనకవసరమైన ఆభరణాలు తెచ్చి ఇమ్మనుటలో వర్ణింపబడినవి. |
| 19. | పాదాభరణం | వాల్మీకి రామాయణంలో లక్ష్మణుని చేత వర్ణింపబడినది. |
| 20. | జడకుచ్చులు | స్త్రీల కేశబంధములకు అలంకారముగా చెప్పబడినవి. |

ఇక సామాజిక దృష్టితో చూస్తే ఈ ఆభరణాలవసరమా? అనే ప్రశ్న ఎదురవుతుంది. వెంటనే సమాధానం స్ఫురించక మానదు. మనం చేసేది కేవలం వైయక్తికమే కాకుండా కులం సంఘం సంస్కారాల పేరిట, ఆర్థిక వనరుల మేరకు తప్పకచేయవలసే వుంటుంది. కనుక ఇక్కడ సామాన్యుడు ఇదొక రకమైన పొదుపు అని కూడా దీనిని భరించి ధరించవలసి వస్తుంది. ఇదిగాక మణిమాణిక్యాలనేవి ఉన్నయ్. అవి ఆభరణాల క్రిందికే లెక్కకు వస్తాయి. వాటిని రత్నాలంటారు. వీటిలో 9 రకాలున్నాయి. వీటినే నవరత్నాలంటారు. వజ్ర, వైడూర్య, మరకత, మాణిక్య, పుష్యరాగ, ముక్తా, ప్రవాల, నీల, గోమేధికములని వాటి పేర్లు. అవి నవ గ్రహాలకు సంకేత రూపాలనీ వాటిని ధరిస్తే అదృష్టం కలుగుతుందని విశ్వాసం ఉంది. వాటి ధారణ, పూజల గురించి మరో ప్రత్యేక అధ్యాయం ఉంది. శిల్ప శాస్త్రంలో రత్న పరీక్ష ఒక భాగం. ఈ రత్న మాణిక్యాలకు వెలకూడా అధికమే. ఆ విధంగా అవి కూడా సంపద కిందకే వస్తాయి.

మన దేశంలో ప్రజలంతా ఆభరణాల్ని మనసారా మెచ్చుకొనే ధరించారు. ఆ విషయం యావత్ భారతీయ సాహిత్యము చెబుతోంది. ఎన్నో శతాబ్దాలుగా యావత్ భారతీయ భాషల్లో ఉన్న గ్రంథరాజాలన్నీ ఈ విషయం చెబుతాయి. మానవుడు విలువైన వస్తువుల్ని కనిపెట్టి వినియోగించుకోవడం నేర్చుకోవడం, నేర్చుకొని చరిత్రలో మరో ముందడుగు వేశాడని చెప్పిన విషయం ఇక్కడ జ్ఞప్తి చేయడమవుతుంది. కళలు, తత్వశాస్త్రం, సామాజిక శాస్త్రాలు, భారతీయ విషయాల అధ్యయనంలో తెలుస్తుంది. ఇదంతా భారతీయ సాహిత్య తులనాత్మక అధ్యయంలో ముఖ్యమైన భాగమే!

ఈ వ్యాసంలో వివిధ కవులు వర్ణించిన నగలు వాటి ప్రాధాన్యం వివరించడం జరుగుతుంది. సామాన్యంగా కవులు వ్రాసే గ్రంథాల్లో నాయకుడు - నాయిక ఉంటారు. వారిలో ప్రేమ, కోపం లాంటి విషయాల వర్ణనలుంటాయి. వారిద్దరిని కలపవడంలోను విడదీయడంలోను ఏదో ఒక చిన్న వస్తువు ప్రాధాన్యత వహించి కథని ముగింపు చేస్తుంది. అది సుఖాంతమో, దుఃఖాంతమో అవడం తప్పదు కదా! సామాన్యంగా కథలో నాయకుని సౌర్య పరాక్రమాలు, తెలివితేటలు, అదృష్ట విశేషాలు పనిచేశాయని వర్ణించడం సామాన్యం. కావ్యాల్లో నాయకునికి మానవ సహజమైన కొన్ని లోపాలు కూడా ఉండడం చూపుతారు. మతిమరుపు, అజ్ఞానం, అంధ విశ్వాసం, చెప్పుడు మాటలు వినడం గుణాల ద్వారా కష్ట నష్టాలలో ఇరుక్కొని దుఃఖం పొందడం చూస్తాం. అదే ఆ కథకు ముఖ్య ఘట్టమవుతుంది. నాయకులలో వున్న ముఖ్య లోపం ఎన్ని సుగుణాలున్నప్పటికి - దుఃఖించవలసి వస్తుంది.

భారతీయ సాహిత్యంలో మానవ కారుణ్యం, స్పందన పుష్కలంగా వుంది. అందువల్ల మంచి వారిని రక్షించడానికి భగవంతుడనే ఒక లంకెను కల్పించి కథకు పుష్టి చేకూరుస్తారు. ఏదో ఒక చిన్న వస్తువు వచ్చి ఆ కథకు ముగింపు కల్పిస్తుంది. ఆ వస్తువు లేకపోతే పడుగు పేకలుగా ఉన్న రకరకాల కథా సూత్రాలకు ఏకతా మార్గం దొరకదు.

ఒక కవి మేఘం ద్వారా సందేశం పంపాడు (మేఘ సందేశం, కాళిదాసు). మరోకవి హంస ద్వారా సందేశం పంపాడు (వేందాంత దేశికుడు, హంస సందేశం). ఒక కవి పురోహితున్ని పంపాడు ( రుక్మిణీ కళ్యాణంలో పోతన్న చూపిన పురోహితుడు). ఒక కవి చెలికత్తె ద్వారా సందేశం పంపుతాడు ( వసు చరిత్రలో రామరాజభూషణుని చెలికత్తె పాత్ర). ఒక ప్రేమికుడు తన ప్రేయసి దగ్గరికి మరో ప్రేమికుడి ద్వారా సందేశం పంపుతాడు ( శ్రీహర్ష మహాకవి నైషదీయ చరిత).

కథాసూత్రాలు ముడివేయడానికి ఉపయోగించిన వస్తువుల్లో నగ ఒకటి. అదే ఈ వ్యాసంలో వివరణాత్మక అధ్యయనానికి గైకొనబడిన ముఖ్యవస్తువు. నగ అంటె ఒక జడ పదార్థము. ధరించి ఆనందించడానికి తప్ప మరోవిధంగా దానికి చైతన్యం లేదు. కాని దాన్ని ధరిస్తే అందము ఆనందము కలిగిస్తాయన్న సంగతి మరచి పోకూడదు. కొన్ని నగలు ఆయా వ్యక్తుల స్థాయికి సూచికలు కూడా. శిల్ప శాస్త్రాలలో నగల తయారీపై దీర్ఘ వర్ణనలున్నాయి. ఆ విషయాన్ని ప్రత్యేక దృష్టితో చూచి అధ్యయనం చేయదగినదే. కిరీటం రాజరికానికి చిహ్నం. మాంగల్యం పుణ్యస్త్రీ సూచకం. జంధ్యం బ్రహ్మచారికి, పుస్తకం విద్యార్థికి, రుద్రాక్షమాల / పుండ్రాలు భక్తులకు సంకేతాలు. ఇవన్నీ కేవలం బహిరంగా భరణాలు, లోపలి విషయాల్నేవి తెలుపజాలవు. కాని సమాజ ఖేలలో ఇవి తప్పని చిహ్నాలు - వస్తువులు.

ప్రతి భారతీయ భాషలోని కావ్యాలలో కవులు తప్పని సరిగా ఈ నగలు వర్ణించారు. సంప్రదాయంలో సంస్కారాలు విధించిన కట్టుబాట్ల వల్ల విధిగా ప్రతివారు వీటిని ధరించిన విషయాన్ని వర్ణించిన వివరాలున్నయ్. అవి కేవలం పుస్తకాలకే పరిమితం కాక సామాన్యుని దైనందిన వ్యవహార భాషలో భాషీయాలుగా నిత్యవ్యవహారం పొందాయి. పురుష రత్నం - భారతరత్న - ప్రధాన పుటుంగరం - పెళ్ళి ఉంగరం - మకుటాయమానం - దర్పణ దృశ్యం - కంకణ దృశ్యము - ముత్యాల వంటి పలువరుస - మాణిక్యాల్లాంటి పిల్లలు - కనకాంబరం - కాంచనాంబరం మొదలైన - మాటలు - ప్రయోగాలు ఎన్నెన్నో దృశ్యాల్ని కళ్లముందుంచుతాయి. భారతీయ భాషలన్నింటిలోనూ వీటిని చూడవచ్చు. ఈ శబ్దాలు ఆయా వ్యక్తుల / పదార్థాల విశిష్టతను విలువను తెలియ జేస్తాయి. కనుక నగలు, రత్నాలు భాషలో కూడా నిత్య స్థానాలు పొందిన విషయం గమనించాలి. ఆ విలువల్ని మదింపు వేసేటప్పుడు సామాజిక శాస్త్రం పనికి వస్తుంది. మానవ మానసిక స్థితుల్ని దర్పణం పడుతుంది. మన సమాజానికి మొదటి గ్రంథమైన ఋగ్వేదంలో మొదటి మంత్రంలోనే - ''అగ్నిమీళే పురోహితం హోతారం రత్నధాతమం'' అని ప్రారంభమవుతుంది. ఆ ప్రాచీన కాలంలో జటావల్కలధారులకు ఈ రత్నమెక్కడిదా? అని ఆశ్చర్యచకితుల్ని చేయకమానదు.

ఇంతా చెప్పిన తరువాత ఈ ఆభరణాలు రూపురేఖల నిర్ణయంలో ప్రధాన పాత్ర వహించుటలో శిల్పశాస్త్రాలేం చెబుతున్నాయో చూడవలసిన అవసరమున్నది. కేవలం ఉదాహరణకు ఒక కిరీట నిర్మాణం గురించే ఒక వర్ణన చూద్దాం.

''కిరీట లక్షణం వినండి, రూపం, కొలతల్ని బట్టి వాటిలో భేదాలున్నయ్, జటా - మౌళి - కిరీటం - కరండం - శిరస్త్రకం - కుంతలం - కేశబంధం - ధమ్మిల్లం - అలకచూడకం అని. మకుటంలో పత్రపట్టం - రత్న పట్టం - పుష్ప పట్టం అనే అలంకారాలుంటాయి.

జటామకుటం శివుడికి, బ్రహ్మకు ఉంటుంది ( ఋషులకును). కిరీట మకుటాలు విష్ణుకి, రాజుకి ఉంటాయి. కరండ మకుటం చిన్న దేవతలకు, జటామౌళి, కుంతలం అనేవి మనోన్మణి అమ్మవారికి, కేశబంధం, కుంతలం అనేది సరస్వతి, సావిత్రి లాంటి దేవతలకు, కరండం మకుటం అనేవి అందరు స్త్రీ దేవతలకు సామాన్యంగా ఉంటాయి. కిరీటం సార్వభౌముడు, చక్రవర్తి, అధిరాజు పట్టం గల వారికి వాడవచ్చు. కరండం నరేంద్రులకు, శిరస్త్రకం పార్ష్ణిలకు, కరండమకుటం చక్రవర్తులకు, రాజలుందరికి, పత్రపట్టం అలంకారం పట్టాభిషేకం పొందినవారికి, రత్నపట్టం పార్ష్ణికులకు, పుష్పపట్టం పట్టాభిషేకం పొందబోయే వారికి ఉండాలి. పుష్పమాల్యం ప్రహారకులకు, అస్త్రగ్రాహికులకు ఉండాలి. కుంతలం - మకుటం అనేవి చక్రవర్తి భార్యకు వుండాలి. కేశబంధం అధిరాజస్త్రీలకు, నరేంద్రుల భార్యలకు ఉండాలి. ధమ్మిల్లము - మకుటము అనేవి కేశాలంకారాలు. పార్ష్ణిక - పట్టధర - మండలేశ, పట్టభాక్ అనే రాజ పురుష స్త్రీలకు ఉండాలి. అలక చూడము ప్రహారక స్త్రీలకు, అస్త్రగ్రాహి భార్యలకు వుండాలి.

కిరీటం ఎత్తు ముఖం ఎత్తుకు సమంగానో రెండింతలో, మూడింతలో ఉండాలి ( అంతకు మించకూడదు). బ్రహ్మ, రుద్రుల కిరీటాలు $2\,^{3}/_{4}$ ముఖం కొలతలో ఉండాలి. ఇతర దేవతల కింతకంటే తక్కువుండాలి. కిన్నర, యక్షులకు ముఖమంతే ఉండాలి. స్త్రీ దేవతలకు రెండు ముఖాల ఎత్తు, వెడల్పు ఈ చెవి నుండి ఆ చెవి దాకా వుండాలి. మకుటం వెడల్పు ముఖం వెడల్పుకు సమానంగా వుండాలి. మకుటం చివర 1 / 8 వెడల్పుండాలి. కరండ మకుటం చివర 1 / 3 వెడల్పు వుండాలి.

కిరీటాలన్నీ క్రింది నుండి పైకి తగ్గుతూ ఉండాలి. సార్వభౌముడి కిరీటం ఎత్తు శిరస్సు వెడల్పుతో సమానంగా వుండాలి. మహారాజు కిరీటం దానికంటే 1/16 భాగం తక్కువ. నరేంద్రుడి కిరీటం 12/16 భాగాలు. పార్ష్ణికుని కిరీటం 8/16 భాగాలే. చక్రవర్తి భార్య కిరీటం పొడవు తల వెడల్పంత. అందరు రాణుల కిరీటాలు ముఖం వెడల్పుతో సమానమైన ఎత్తుతో ఉంటాయి. ధమ్మిల్లము అలకచూడము అనేవి పైదానికి 1/2 లేక 1/4 భాగాలు తగ్గి వుంటాయి. శిల్పాచార్యుడు కొలతల ప్రకారమే ఈ ఆభరణాలు చేయాలి. పట్టధారి తలపై పట్టం తల వెడల్పులో 3వ భాగంగా ఉండాలి. పట్టభాక్ ధరించే పట్టం తల వెడల్పులో 1/6 ఎత్తు ఉంటుంది. ఇక ఆభరణాలు చెప్పబడతాయి. చక్రవర్తి ధరించే మకుటానికి 10 బంగారు ఆకులతో కూర్చిన మాలికలుంటాయి. రాణీగారి మకుటం రాజు మకుటంలో సగముంటది. అధిరాజ మకుటం 2వేల నిష్కాలతో ఉంటుంది. నరేంద్ర మకుటం దానికి తగ్గి వుంటుంది. పార్ష్ణికుని శిరస్త్రాంలోను, పట్టభాక్ శిరస్త్రంలోను నిష్కాలు క్రమంగా తగ్గి ఉంటాయి. మకుటం ఎత్తుమీద వేరే కొలతలతో మకుట మణి ఉండాలి. జటా మకుటం, కేశబంధం, కుంతలం అనేవి వెంట్రుకల పాయలతో వుంటాయి. కిరీటం మౌళి అనేవి చెవిలా వుంటాయి. కరండం నెమలి పింఛంలా వుంటుంది. శిరస్త్రకం నీటి బుడగలా వుంటుంది. ధమ్మిల్లం లతలాగా వుంటుంది. అలకచూడము శిరోజాల చివరలు ముడవడంలో వుంటది. కరీటం ఎత్తును 26 భాగాలు చేస్తే ఫాలపట్టం ఎత్తు 5 భాగాలు, చూడం $2^1/_2$, పూరిమ 5, క్రింది భాగం 6. దేవతల కిరీటం ఎత్తు 20 భాగాలైతే పార్శ్వపూరిమ భాగాలు 9, తుండం 6 భాగాలు, అగ్రపట్టం $1^1/_2$, వేత్రకం 3/4, పట్టం 1/2, పద్మం 1, కుట్మలం 2 భాగాలుండాలి. కిరీటం ఎత్తు అంటే శిరస్సుమీద నుండి మకుటం చివరిదాకా దానిమీద శిఖామణి వుంటుంది. శిఖామణి కుట్మలం మీద ఉంటుంది. కిరీట ప్రారంభంలో లతలు వుంటాయి. ఇతర స్థలాల మీద తరంగాల కల్పన వుంటుంది. ఆ తరంగాల మీద పుష్పాలు, రత్నాలు చెక్కాలి. పూరిమల ఇరువైపుల మకరాలుంటాయి. వాటి మధ్య రత్న బంధం వుంటుంది. ఈ రత్న బంధం ఎదురుగా ఉంటే దాని ప్రక్కన లతలుండాలి. మకరం మీద వల్లీమాలలుండాలి. ముందు మకరమాలిక ఉండాలి. కిరీటం మొదట ముక్తాదామం ఉండాలి. దానిముందు పట్టబంధం ఉండాలి. దానిక్రింద చంద్రరేఖలా రత్నహారం వ్రేలాడాలి. పూరిమలకు ప్రక్కన పత్రపూరిమలుండాలి. పూరిమ మధ్య రత్నం ఉండాలి. దానిక్రింద నుండి హారాలు వ్రేలాడదీయాలి. అలా వ్రేలాడే హారాలకు రత్నాలు పొదగాలి. కిరీటం వెనక ఉండే పూరిమ కిరీటం మధ్యకు రావాలి. ఇది కిరీటం లక్షణం''. ఇది ఇలా సాగిపోతోంది. (మానసార శిల్పశాస్త్రం 40వ అధ్యాయము).

11వ శతాబ్ది కాశ్మీర కవి క్షేమేంద్రుడు ''కళావిలాసం'' అనే తన కావ్యంలో స్వర్ణకారుల కళాత్మకమైన తప్పిదాల పట్టికతో విమర్శన వెలయించాడు. దీనికి 21వ శతాబ్ది కవి అవధాని శిరోమణి పులవర్తి శరభాచార్య డి.ఇ.ఓ. గుంటూరు, ఆంధ్రప్రదేశ్ ''కళాదర్శం'' అనే సంస్కృత నాటకంలో చమత్కారంగా సమాధానాలు సమకూర్చాడు. ఇదంతా మన తరతరాల బంగారు సరాల కథకు అతిసంక్షిప్త రూపం. మేధావుల్ని గిలిగింతలు పెట్టిన ఆ నగలకు, వాటి సృష్టికర్తలకు, కలమెత్తి ఆ నగల విశేషాల్ని సమాజానికి పరిచయం చేసిన మేధావులకు జోహార్లు!

(తులనాత్మక సాహిత్యాధ్యయనం తెలుగు - హిందీ - తమిళ - కన్నడ - మళయాళ - మరాఠీ సాహిత్యాల ఆధారంగా)

# ప్రాచీన కన్నడ స్త్రీసాహిత్యం

- డా॥ కె. ఆషాజ్యోతి

దక్షిణ భాషా సాహిత్యాలలో కన్నడ భాషకూ, సాహిత్యానికి ప్రత్యేక స్థానముంది. కన్నడ సాహిత్యంలో బీజావాపనం సంస్కృత మూలాల నుండే కావడం వల్ల మొదటి సాహిత్య రచన అనువాదంతో ప్రారంభమైంది. ఈ సాహిత్యం ప్రధానంగా శిష్ట సాంస్కృతికమే కాదు, పితృస్వామ్య భావజాల వాహికగానూ సాగింది. ఈ కారణంగా జన జీవనంలో ప్రధానాంశాలు చాలా భాగం పితృ స్వామ్య మూలాల నుండే స్వీకరించడం వల్ల స్త్రీ ప్రాధాన్యం కలిగిన అంశాలు అప్రధానమై తోసివేయబడ్డాయి. ధార్మిక విధులు, ఆచరణలు ఎక్కువగా దేవతా సంబంధమైనవైనప్పటికీ ఈ దేవతా రూపమైన స్త్రీ బ్రతుకు నిజజీవితంలో అందుకు భిన్నంగా తయారైంది.

పితృస్వామ్య భావజాలం ప్రాచీన కన్నడ సాహిత్యంలో ప్రముఖంగానూ, ధార్మిక సాహిత్యం, వీర కావ్యాలలో పారదర్శకంగానూ ప్రతిఫలిస్తూ పురుషుల ధార్మిక, తాత్విక, సామాజిక, రాజకీయ అంశాలను బలోపేతం చేస్తుంది. ఈ కారణం చేత ప్రాచీన సాహిత్యంలో స్త్రీ పాపకర్మ ఫలాంశంగా చిత్రింపబడింది. పశుపక్ష్యాదుల పుట్టుకలానే స్త్రీజన్మ కూడా పాపఫలితమేనని భావించబడింది. శృంగార రసపోషణకు స్త్రీ దేహం ప్రధాన వస్తువుగా స్వీకరింపబడింది. పతివ్రత లేదా పతిత వంటి ప్రతీకలతో ఉచ్ఛ నీచాలకు గురికాబడింది.

సాహిత్యంతో స్త్రీ సంబంధం విడదీయరానిది. ఏ యుగంలో నైనా స్త్రీ సాహిత్యంలో నిర్మాణాత్మకమైన పాత్రనే పోషించింది. స్త్రీ దర్శనం సాహిత్యంలో మూడు భాగాలుగా కనబడుతుంది. ఆ యా యుగాలలో వచ్చిన సాహిత్యంలో స్త్రీ తానొక పాత్రగా మారి కథ ప్రారంభం నుండి ముగింపు దాకా కథను నడిపించడంలో భాగం వహించింది. అనంతర కాలంలో పాఠకురాలై సాహిత్యాధ్యయనంలో భాగస్వామ్యం స్వీకరించింది. ఆ తరువాత పురుష పరమైన సాహిత్యంలో అటు పాత్రల పరంగానూ, ఇటు పఠన పరంగానూ భాగం వహిస్తూ తనదైన దృష్టికోణంతో రచనా వ్యాసంగానికి ఉద్యుక్తురాలైంది.

కన్నడ సాహిత్యంలో కూడా ఇతర భాషా సాహిత్యాలలోలానే రచనా ప్రక్రియ పురుష కోణం నుండే సాగిందనడంలో ఎటువంటి సందేహమూ అక్కరలేదు. పురుషస్వామ్య వ్యవస్థ స్త్రీ ప్రతీకలుగా శాశ్వతంగా రూపొందించిన పతివ్రత, దేవతామూర్తిమత్వం, మాతృత్వం వంటి పడికట్టు భావజాలం నుండి వెలుపలికి వచ్చి చేసిన రచనలు దాదాపుగా లేవనే భావించాలి. రత్న త్రయంగా పేరు పొందిన రన్న, పొన్న, పంప సమాజానికి దిగుమతి చేసిన స్త్రీ రూపం పితృస్వామిక భావజాల నమూనాలే. మయసభలో దుర్యోధనుడు జారి పడినప్పుడు ద్రౌపది నవ్విన నవ్వు మహాభారత యుద్ధానికి మూల కారణమంటాడు కుమార వ్యాసుడు. వ్యాస భారతంలోని శకుంతల దృఢచిత్తం కలిగిన స్త్రీగా కనబడినా, కాళిదాసు శకుంతల బేలగా చిత్రింపబడింది. అటు తరువాత వచ్చిన కవులు వ్యాస శకుంతలను వదిలి కాళిదాసు శకుంతలను ఆదర్శంగా తీసుకొని అమాయకత్వం, కోమలత్వం మూర్తీభవించిన శకుంతలనే

డా॥ కె. ఆషా జ్యోతి, సీనియర్ తెలుగు లెక్చరర్, బెంగుళూరు యూనివర్సిటి, బెంగుళూరు.

శాశ్వతంగా సాహిత్య చరిత్రలో నిలిపారు. అలాగే భారతంలో గాంధారి, రామాయణంలో సీత, ఊర్మిళలు అబలత్వం మూర్తీభవించిన పాత్రలే. ఆయా సందర్భాలలో స్త్రీ పాత్రలను అవహేళనకు గురి చేయడమూ కద్దే. పంపడు చిత్రించిన అంబ పాత్ర, జన్నని ''యశోధరుని చరిత్ర''లో అమృత మతి అవహేళనకు గురైన పాత్రలు.

ఏక మొత్తంగా కన్నడ సాహిత్యంలో స్త్రీ సాధ్వి, పతివ్రత, గయ్యాళి, కుటిల, కురూపి, సుందరి, జారిణి, వేశ్య, పతిత లాంటి విశేషణాల దుర్బిణి నుండే దర్శింపబడింది. స్త్రీ వ్యక్తిత్వం ఎక్కడో మరుగునపడిపోయింది. ఈ నేపథ్యంలో 12వ శతాబ్దిలో వచ్చిన ''వచన సాహిత్యం'' కన్నడ సాహిత్యంలో అద్భుతమైన, ఆలోచనాయుతమైన ప్రకంపనలకు, మార్పులకు మూలభూతమైంది.

**వచన యుగ సాహిత్యం.....**

12వ శతాబ్దంలో రచింపబడిన కన్నడ వచనాలను ''శరణ సాహిత్యమని'' కూడా పిలుస్తారు. శరణ సాహిత్యం రచించిన పురుషులకు ''వచన కారరు'' అని, స్త్రీలను ''వచన కార్తియరు'' అని అంటారు. అనేక కారణాల వల్ల ఈ యుగ సాహిత్యం ఇతర సాహిత్య ప్రక్రియల కంటే భిన్నమై నిలించింది. ఏక కాలంలో ఎంతోమంది వచన రచనా కవయిత్రులు ఉద్భవించిన కాలమది. ముఖ్యంగా భారతీయ సంస్కృతిలో స్త్రీ నిర్బంధింపబడడంతో ఆమె బౌద్ధిక వ్యక్తిత్వం వికసించనే లేదు. స్త్రీ పూజింపబడాలని అంటూనే మరొక పక్క స్త్రీ స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించారు. స్త్రీ భోగ వస్తువుగా తప్ప మరొక దృష్టితో చూడబడలేదు. ఐతే జైన, బౌద్ధ ధర్మాలు స్త్రీ స్వాతంత్ర్యం ఆకాంక్షించినా, వచన యుగంలో మాత్రమే కవయిత్రులు సంపూర్ణ స్వాతంత్ర్యం, బౌద్ధిక వికాసం నేపథ్యంగా స్త్రీ సంబంధిత అనేకాంశాలను స్పృశించగలిగారు.

స్త్రీ ఆలోచించగలదు అనే విషయం మొట్టమొదటిసారిగా ఈ కవయిత్రులు నిరూపించారు. చరిత్రలో స్త్రీలు గళం విప్పడమే అపురూపం. స్త్రీల స్వరం ఒకే సందర్భంలో సామూహికంగా వినబడడం అద్భుతమైన విషయం. 12వ శతాబ్దంలో వీరి సాహిత్యం ప్రత్యేకమై నిలిచింది. అన్ని వర్గాల స్త్రీలు సాహిత్య సృష్టికి పూనుకోవడమే ఇందుకు ప్రాధాన కారణం. వైదిక మత పారంపర్యతను తిరస్కరిస్తూ నాటి సమాజంలో ఈవచన సాహిత్యం కొత్త గాలులను సమాదరించింది.

**వీరశైవం**

ఈ శతాబ్దంలో బసవని వీర శైవ మత వ్యాప్తి ద్వారా విప్లవ భావజాల బీజావాపనం జరిగింది. మతం ప్రధాన వాహికగా సాగిన బసవని వచనాలు కర్నాటక ప్రాంతంలో తిరుగులేని భావ ప్రకంపనాలను కలిగించాయి. ఈ వచన రచనోద్యమం నాటి సమాజానికి కొత్త ఊపిరులను పోసింది. ఈ వచన యుగ కవయిత్రులందరూ వర్గ, వర్ణ భేదాలకతీతంగా రచన చేసారు. వీళ్ళంతా శివ తత్వమాధారంగా సమానతను ప్రతిపాదించిన ఆదర్శమూర్తులు. తమ అనుభవాలను, ఆలోచనలను, అంతరంగాలను బహిరంగ పరచుకోవడంలో నిస్సంకోచ వైఖరిని ప్రదర్శించారు.

వచన కవయిత్రులలో ప్రధానంగా చెప్పుకోదగిన వ్యక్తి అక్క మహాదేవి. ఈమె 12వ శతాబ్దిలో ప్రసిద్ధి చెందిన కవయిత్రి. ఆమె జీవితమే అద్భుతం. తన కాలంలోని ఇతర ఆడపిల్లల్లా ఆమె పెరగలేదు. మల్లికార్జునుని పట్ల భక్తి ఐహిక జీవితానికి దూరం చేసింది. భర్తను తిరస్కరించింది. తన భక్తి తత్వానికి, ఆదర్శానికి బద్ధురాలైంది. సమాజ నియమాలను ఉల్లంఘించింది. తన శివ భక్తి ప్రచారానికి కవిత్వాన్ని ఆధారంగా ఎన్నుకొంది. ఆమె కవిత్వంలో ఎంతటి మార్దవముందో అంతటి స్ఫోటక లక్షణమూ ఉంది.

''హెణ్ణాగి గండ కాడిత్తు మాయె
గండాగి హెణ్ణు కాడిత్తు మాయె''

''పురుషుడు స్త్రీని మాయగా భావిస్తున్నప్పుడు, స్త్రీకి కూడా పురుషుడు మాయే! పురుషుడికి స్త్రీ మార్గ నిరోధకురాలే అనుకుంటే, స్త్రీకి కూడా పురుషుడు మార్గ నిరోధకుడే'' అంటుంది అక్కమహాదేవి.

''नारीस्तनभर नाभी देशम् दृष्ट्वा मापाः मोहावेशम्
एतनू मांसावसादि विकारम् मनसि विचिन्सय वारम् वारम्''

క్రీ. శ. 780 కాలం నాటి ఆది శంకరాచార్యుల శ్లోకార్థం అక్కమహాదేవి వచనంలో గమనించవచ్చు. ప్రాచీన సాహిత్యంపై మక్కువా, సంస్కృత సాహిత్యంతో పరిచయం అక్కమహాదేవికి ఉన్నాయని గమనించవచ్చు.

అక్కమహాదేవి అనుభవించిన కష్టాలు, బ్రతుకు కోసం చేసిన పోరాటం ఆమె వచనాలలో ప్రతిఫలిస్తాయి. ఒకసందర్భంలో స్త్రీ పట్ల పురుషులకు గల కాముక దృష్టిని నిరసిస్తూ ఇలా అంటుంది:

''బట్టిహ మొలెయ భరద జవ్వనద
చెలువ కండు బందిరణ్ణా
అణ్ణా నాను హెంగసల్ల
అణ్ణా నాను సూళెయల్ల
అణ్ణా మత్తె నన్ను కండు కండు
ఆ రెందు బందిరణ్ణా
చిన్న మల్లికార్జున నిల్లదె మిక్కిన పురుషరు
నమగాగాద మోరెనోడణ్ణా ...''

''నిండైన వక్షస్థలంతో యవ్వనంతో కూడిన సౌందర్యం చూడడానికి రండయ్యా, నేను స్త్రీని కాను, వేశ్యనూ కాను, ఐనా నన్ను మరిమరి చూడడానికి రండి. ఒక్క చెన్నమల్లికార్జునుడు తప్ప మిగిలిన పురుషులు నాకు కనబడరంటుంది. ''నేను స్త్రీని కాను'' అంటున్న అక్కమహాదేవి స్త్రీత్వాన్ని

తిరస్కరించడం లేదు. స్త్రీత్వం, పురుషత్వం అనే అవస్థలను దాటిపోయిన ఆలోచనా స్థితి అది. తనను శరీరగత జీవిగా కాకుండా లోకం ఆలోచించాలనేదే ఆమె తాపత్రయం. వేశ్యను కానని తెలుపుకోవడంలో స్త్రీ భోగ వస్తువు కాదని నిరసించే స్వరం కనబడుతుంది.

పురుష రక్షణలో స్త్రీ జీవించే పరిస్థితిని అక్కమహాదేవి తిరస్కరించింది. స్వతంత్రంగా బ్రతకడంలోని స్వేచ్ఛను అనుభవించింది, ప్రవచించింది. సమాజగతంగా స్త్రీకి గల సంకెలలను ఛేదించుకొని వెలుపలికి రాగలిగింది. విశ్వకుటుంబీకురాలైంది. ''ఈ లోకద గండరనెల్ల ఒళయొళగిక్కు.'' ''పురుషులందరినీ మంటల్లో పడవెయ్యమంది.'' పురుషుల నైజం పట్ల ఆమెకు గల జుగుప్స, వారివల్ల కలిగిన వ్యథ అర్థం చేసుకొనవలసిందే.

ఈ శతాబ్దంలో వచ్చిన మరొక కవయిత్రి ''సంచిహొన్నమ్మ'' ఈమె రాసిన ''హదిబదెయ ధర్మ'' అనే పతివ్రతా ధర్మంలో భర్తతో స్త్రీ ఎలా ప్రవర్తించాలో తెలపడంతో ఊరుకోలేదు. సున్నితమైన మనస్సున్న స్త్రీ పట్ల భర్త ఎలా ఉండాలో కూడా ఇందులో వివరించింది. ఇరవైయ్యొకటో శతాబ్దంలో గర్భస్థ శిశువు ఆడపిల్ల అని తెలుసుకొన్న మరుక్షణం భ్రూణహత్యలకు పాల్పడే నేటి సమాజానికి చెంప పెట్టులాంటి మాటలతో చురకలంటించింది, నాటికే! ఆమె ప్రతి స్త్రీ ఆలోచించే పరిస్థితిని పన్నెండవ శతాబ్దం లోనే ఏర్పరచింది. పతివ్రతా ధర్మంలో ఇలా అంటుంది :

''పెణ్ణల్లవె తమ్మన్నెల్ల పడెద తాయి
పెణ్ణల్లవె పొరెదవళు
పెణ్ణు పెణ్ణందేతకె బీళుగళెవరు
కణ్ణు కాణద గావిలరు.''

''తల్లిగా మనలను సమాదరించేది స్త్రీ కాదా? కీర్తిని కలిగించేది స్త్రీ కాదా? అటువంటప్పుడు స్త్రీ, స్త్రీ అంటూ తిరస్కారం దేనికి? కేవలం మూర్ఖులే అలా భావిస్తారు'' అంటుంది.

అందులోనే స్త్రీ, పురుషులనే వ్యత్యాసం ఎందుకోసం అంటూ ప్రశ్నిస్తుంది. కొడుకుల వల్ల కలిగే గుణమేమిటుంది? కూతురుల వల్ల నష్టమేమిటి? కీర్తి ఎవరి వల్ల కలుగుతుందో వారి వల్ల స్వర్గ ప్రాప్తి కలుగుతుందని ఖచ్చితంగా తెలిపే ధీటైన వ్యక్తిత్వం ఇందులో చూడవచ్చు :

''కువరనాదొడె బంద గుణవేనదరిందె
కువరియాదొడె కుందేను ?
ఇవరిర్వరొళ్ళెగ్గె పడెదవరింద
సవనిపు దిహపర సౌఖ్య''

ఆ కాలంలోనే మరో కవయిత్రి ''సత్యక్క'' స్త్రీ, పురుషులను శరీరాకృతులతో కొలవకండని తెలుపుతుంది. దేనికైనా శంభుడే మూలమని వక్కాణిస్తుంది. అందవిహీనమైన పుష్పానికి దాని వాసనకు ఈశ్వరుడే మూలమనే దైవ భక్తి సాహిత్యం మనకు వచన యుగం ఆద్యంతం కనబడుతుంది.

''మాలె మూడి ఇద్దరె హెణ్ణెందు ప్రమాణిసలిల్ల
కాసె మీసె కఠారవిద్దరె గండెందు ప్రమాణిసలిల్ల
అదు జగద హొహె. బల్లవర నీతియల్లి
అందవిల్లద కుసుమక్కె వాసనెయు కారణ
ఇదరింద నీనే బల్లె శంభుజక్కేశ్వరా''

బసవని భార్య నీలమ్మ రాసిన వచనాలు విశిష్టమైనవి. ఆమె వచనాలలో ప్రస్ఫుటంగా బసవనిపై గల ప్రేమానురాగాలతో పాటు స్త్రీ ఔన్నత్యం కోసం ఆరాటం గోచరమవుతుంది. దళిత స్త్రీ గొగ్గవ్వ మరొక ప్రసిద్ధ కవయిత్రి. దళిత స్త్రీ అయినప్పటికీ అక్షరాభ్యాసం చెయ్యడమే కాక కవితా రచన చేసి సమాజంలోని లోటు పాట్లను ప్రశ్నిస్తుంది.

''గండు మోహిసి హెణ్ణు హిడివడె
అదు ఒబ్బర ఒడవె ఎందు అరియబేకు
హెణ్ణు మోహిసి గండ హిడదడె
ఉత్తర వావు దెందరియబేకు''

''పురుషుడు స్త్రీని మోహిస్తే అది పురుషునికి అలంకారం. స్త్రీ పురుషుని ఆశిస్తే సమాధానం ఏమిటో తెలుసుకోవాలి.'' అంటూ సమాజంలోని అసమానతలను ఎత్తి చూపుతుంది. స్త్రీ, పురుషుల మధ్య వ్యత్యాసం ఎందుకుండాలని ప్రశ్నిస్తోంది.

వేశ్యగా ఉన్నా సంకవ్వ వచనాలు రాయడంలో దిట్ట. వ్రతహీనులైన వారిని ముఖ్యంగా శైవారాధకులు వ్రతహీనతకు పాల్పడితే చేతులు, చెవులు, ముక్కు కోసి వేయమంటోంది. తన వద్దకు వచ్చే పురుషులు వ్రతహీనులు కారాదని శాసిస్తోంది.

''వ్రతహీనవరిదు బెరెదడె
కాద కత్తియలిక్కె కివి మూగు కొయ్యువరయ్యా'' అనడంలో పై అర్థమే స్ఫురిస్తోంది.

స్త్రీ పురుష సంబంధాల నేపథ్యంలో సాగిన వచన సాహిత్యం స్త్రీ పురుష సంబంధాలలోని అసమానతని, అనైతికతను ప్రశ్నించింది. పైన పేర్కొన్న స్త్రీలే కాక నీలలోచన, లింగమ్మ, రాయమ్మ, ఆయ్దక్కి, లక్ష్మమ్మ, గంగమ్మ, గంగాంబిక, కొట్టణ సోమక్క, వీరమ్మ, కాళవ్వ, మసణమ్మ, రెమ్మవ్వ, కామమ్మ, రేచవ్వ, లక్ష్మమ్మ మొదలైన కవయిత్రులు సమాజ భావ చైతన్యానికి తమ వంతు కృషి చేసారు. ఈ కవయిత్రులందరూ సామాజిక దృక్పథంతో భిన్న వర్గ, వర్ణాల నుండి వచ్చినటువంటి వాళ్లు. తమ జాతి మోస్తున్న వేదనను తొలగించే ప్రయత్నం చేసారు. వీరి వ్యక్తిత్వంలో ఎక్కడా శారీరక సౌందర్య వర్ణన కనబడదు. స్త్రీ వ్యక్తిత్వం కలదిగా భావించారు. స్త్రీ పురుష సమానతకు ఇరువురి ప్రాధాన్యం ఆవశ్యంగా గుర్తించారు. స్త్రీ అభివృద్ధికి ఎప్పుడూ, ఎక్కడా పురుషుణ్ణి ద్వేషించరు. ఈ కవయిత్రుల ఆర్తి వ్యక్తి సంబంధం కాక సమిష్టి వ్యవహారం కొరకు చేసే కృషి కావడం వల్ల వచనాలు సార్వజనీన లక్షణంతో విశ్వవ్యాపనం చెంది తరతరాలుగా నిలచి ఉన్నాయి.

# తల్లులు - పిల్లలు

- వింజనంపాటి రాఘవరావు

బిడ్డ పుట్టగానే మొదట చూసేది అమ్మను. పలికే మొదటి మాట 'అమ్మా' అని. తల్లిలేని బిడ్డ దూదికంటే, దుమ్ముకంటే, గడ్డిపరక కంటే చులకన అన్నాడో ప్రాచీన కవి. మనకు ఆధారాన్ని ఇచ్చే భూమిని, జీవ జలాన్నిచ్చే నదులను తల్లులుగా భావించటం మన సంప్రదాయం.

''మాతా భూమిః పుత్రోహం పృధివ్యాః'' అని సంప్రదాయ కవిత్వంలో చెప్తే

''పుడిమి తల్లి పురిటి నెప్పులు క్రొత్త సృష్టిని స్ఫురింపించాయి'' అంటూ విప్లవ కవిత్వంలో వ్యక్తీకరించారు. వాదం ఏదైనా తల్లి విషయంలో అభిప్రాయ భేదం లేదు.

చెడ్డ తండ్రి, చెడ్డ కొడుకు, చెడ్డ కూతురు ఉండొచ్చుకాని చెడ్డ తల్లి మాత్రం భూమ్మీదలేదు. ప్రాణి ప్రపంచంలో ప్రతి తల్లిదీ ఓ ప్రత్యేకమైన కథ.

పిల్లల్ని వాటి కర్మానికి వాటిని వదలి వెళ్ళిపోయే తల్లులూ,
పిల్లల బాధ్యత తండ్రిమీద వదిలేసే తల్లులూ,
పిల్లల పెంపకం మరొకరి మీద వేసి వెళ్ళిపోయే తల్లులూ,
పిల్లల కోసం తమజీవితాన్ని త్యాగం చేసే తల్లులూ,
పిల్లల్ని కాపాడటానికి ఎంతటి ఉపద్రవాన్నైనా ఎదిరించే తల్లులూ,
పిల్లల్ని తమతో చాలాకాలం ఉంచుకుని మంచి చెడూ చూసే తల్లులూ... అబ్బో! ఎన్నో రకాలు.

అయితే ప్రాణి ప్రపంచంలోని ఇన్నిరకాల తల్లులనూ మనం మనుషుల్లో చూడచ్చు. అందుకే కాబోలు మనల్ని మనం మనుషుల్తో కాక జంతువులతో పోల్చుకుని గర్వపడటమో, తృప్తిపడటమో, అవమానపరచటమో చేస్తుంటాం. ప్రాణి ప్రపంచంలో 'తల్లీ-పిల్లల' అనుబంధాన్ని మరికాస్త దగ్గరగా గమనిద్దాం! రండి.

అత్యంత ప్రాథమిక జీవులైన ఏకకణజీవులలో, శరీరం రెండుగా విడిపోవటం వలన రెండు పిల్ల జీవులేర్పడుతాయి. తల్లి, పిల్ల అన్నభేదం ఇక్కడ కనపడదు.

మరికాస్త అభివృద్ధి చెందిన స్పంజికలలోనూ, జెల్లీచేప, హైడ్రావంటి జీవులలోను గ్రుడ్డునుంచి వచ్చిన పిల్ల స్వేచ్ఛగా ఈదుతూ వెళ్ళి కొత్త చోట స్థిరపడుతుంది. వీటిల్లో తల్లీ పిల్లలకు సంబంధమే లేదు.

ఎలికపాములు, బద్ది పురుగులు, వంటి జీవుల్లో అసంఖ్యాకంగా గ్రుడ్లు పెట్టటం జరుగుతుంది. కాని తల్లి పిల్లల మధ్య అనుబంధం కనపడదు.

---

వింజనంపాటి రాఘవరావు, జంతుశాస్త్రోపన్యాసకుడు, ఆం.ప్ర.గు. జూనియర్ కళాశాల,
పోలీసుబ్యారెక్స్, హిందూపురం, అనంతపురం జిల్లా - 515 202.

వానపాము, జలగలవంటి జీవులు వాటి గ్రుడ్లను ఒక కోశంలో ఉంచి సురక్షితమైన ప్రదేశంలో దాస్తాయి. అంతటితో వాటి బాధ్యత తీరిపోతుంది.

అతుకులు గల కాళ్ళున్న ఆర్ద్రోపోడ వర్గపు జీవులలో చాలా జీవులు తమ సంతానాన్ని కాపాడుకోవటానికి రకరకాల ప్రయత్నాలు చేస్తాయి. ముందుగా మనకు పరిచయమైన వాటి గురించి చూద్దాం!

చీమల పుట్టలోని రాణి చీమ మాత్రమే గ్రుడ్లు పెడుతుంది. గ్రుడ్లను సంరక్షించటం, పిల్లలకు తిండి పెట్టటం, కోశంలో నిద్రించే పిల్లలను జాగ్రత్తగా చూసుకోవటం వంటి పనులను రాణి చీమ 'వంధ్య' సంతానం చూసుకుంటుంది. తేనెటీగల్లోను ఇదే పద్ధతి కన్పిస్తుంది. అయితే రాణుల సంతానం, రాణినీ, పిల్లలనూ ఎందుకు జాగ్రత్తగా చూసుకుంటాయి? తల్లి చీమ లేకపోతే కొత్త సంతానం జన్మించక పుట్ట క్షీణిస్తుంది. రాణి ఈగ లేకుండా మిగతా జనాభా ఎంత ఉన్నా తేనెపట్టు అంతరించి పోతుంది. - ప్రస్తుతం ప్రపంచ జనాభా పెరుగుతూ ఉన్నా కొత్త తరం లేని కొన్ని దేశాల్లో జనాభా క్షీణించటం మనకు తెలిసిందే.

పాటర్ వాస్ప్ అనే కందిరీగ ఒక కుండను మట్టితో కట్టి, దానిలోకి ఒక గొంగళి పురుగును విషంతో కదలకుండా చేసి వదుల్తుంది. గొంగళి పురుగుపై గుడ్డు పెడుతుంది. కందిరీగ పిల్ల బయటకు వచ్చి, గొంగళిపురుగును ఆహారంగా తీసుకొని పెద్దదౌతుంది. తన సంతానానికి పుట్టగానే తాజా ఆహారం అందించటం కోసం పాటర్ వాస్ప్ (potterwasp) ఈ పని చేస్తుంది. సాండ్ వాస్ప్ (sand wasp) అనే కందిరీగ, జువెల్ వాస్ప్ అనే మరో రకం కందిరీగ కూడా ఈ పద్ధతినే అనుసరిస్తాయి. అయితే ఈ కందిరీగల పిల్లలు తమంత తాముగానే తర్వాతి జీవితాన్ని గడపవలసి ఉంటుంది.

తేళ్లు తమ సంతానాన్ని పది పన్నెండు రోజుల వరకూ తమ వీపుమీదే వుంచుకుని కాపాడుతాయి. కేరళలో నివసించే ఇక్తియోఫిస్ (Ichthyophis) అనే ఉభయచరం తన గ్రుడ్లకు చుట్టుకుని కాపాడుతుంది.

సురినమ్ టోడ్ (Surinam Toad) అనే బోదురు కప్ప వీపుపై ఉండే గుంటల్లో గ్రుడ్లను ఉంచి ఎనభై రోజులు కాపాడుతుంది. పూర్తిగా అభివృద్ధి చెందిన డింభకాలను నీటిలో వదుల్తుంది. మన ఇళ్ళలో నివసించే కొన్ని రకాల సాలె పురుగులు తెల్లటి సంచి పొట్టకతికించుకుని తిరగటం మీరు చూసే ఉంటారు. ఈ సంచిలో దాని పిల్లలుంటాయి. అవి స్వతంత్రంగా జీవించగలిగే వయసు వచ్చిందాకా తల్లి వాటిని కాపాడుతుంది.

ఆస్ట్రేలియాలో నివసించే కంగారూలు, నీటి 'అపోసమ్' (opposum) వంటి జీవులలో పిల్లలు తమ తల్లి పొట్ట క్రింద ఉండే 'మార్సుపియమ్' (marsupium) అనే సంచిలో ఉంటాయి. వాటికవసరమైన ఆహారం సంచిలోపల ఉండే క్షీర గ్రంథులు అందిస్తాయి. స్వతంత్రంగా జీవించే వయసు రాగానే పిల్లలు మార్సుపియమ్ నుండి బయటకు వస్తాయి.

హిప్పోకాంపస్ అనే నీటి గుఱ్ఱం (hippocampus)లో పిల్లలను పెంచటానికి పనికివచ్చే సంచి మగ జీవుల్లో ఉంటుంది. స్త్రీ జీవి విడుదల చేసిన గ్రుడ్లను ఫలదీకరించి, తన పొట్ట క్రింది ఉన్న ''బ్రూడ్ పౌచ్'' (brood pouch) అనే సంచిలో ఉంచి పిల్లలు పెద్దవయేవరకు కాపాడుతుంది.

అలైటిస్ (Alytes) అనే 'యడ్ వైఫ్ టోడ్' లలో మగ కప్ప తీగలుగా ఉన్న గ్రుడ్లను తన కాళ్ళచుట్టూ వీపుమీద చుట్టుకుని కాపాడుతుంది. తోకకప్పలు గ్రుడ్డు నుండి బయటకు వచ్చే సమయానికి నీటిలోకి వెళ్ళి లార్వాలను వదులుతుంది.

ఆస్ట్రేలియాలో నివసించే 'గాస్ట్రిక్ బ్రూడింగ్' (Gastric brooding) కప్ప నిజంగానే పిల్లలను కడుపులో వుంచుకుని కాపాడుతుంది. ఈ కప్ప తన పాతిక గ్రుడ్లనూ మింగేస్తుంది. గ్రుడ్ల నుంచి వెలువడే రసాయనాలు జఠరస్రావాలు విడుదల కాకుండా ఆపుతాయి. కప్ప పిల్లలు తయారైన తర్వాత తల్లి నోట్లోంచి బయటకు గెంతుతాయి.

డార్విన్ కప్పలలో మగ కప్ప తోక కప్పలను తన నోట్లోని స్వరకోశాలలో వుంచుకుని పిల్లలయేదాకా కాపాడుతుంది.

కప్పలే కాదు చేపలుకూడా తమ సంతానాన్ని కాపాడుకోవటంలో ఎంతో జాగ్రత్త వహిస్తాయి. గ్రుడ్లను నీటిలో వదిలేస్తే వాటిలో బ్రతికి బట్టకట్టే వాటి శాతం తక్కువ. తల్లి చాలా ఎక్కువ గ్రుడ్లు ఉత్పత్తి చేయవలసి వస్తుంది. ఉదాహరణకు సాల్మన్ (Salmon) చేప శరీరంలో దాని ప్రత్యుత్పత్తి వ్యవస్థ నాలుగోవంతు ఉంటుంది. పాతిక కేజీలు బరువుండే చేపలో రెండు కోట్ల ఎనభైమూడు లక్షల అరవై ఒక్క వేల గ్రుడ్లు లెక్క బెట్టారు. ఇంత భారీ పరిమాణంలో గ్రుడ్లు ఉత్పత్తి చేయటం కంటే తక్కువ గ్రుడ్లకు కాపలా కాయటం తెలివైనపని. చాలా చేపలు ఈ పనే చేస్తాయి.

జువార్సిస్ వివిపారెస్ (zoarces viviparus) అనే చేప, సొరచేపలు (sharks) పిల్లలకు జన్మనిస్తాయి.

అమెరికాకు చెందిన 'గఫ్ టాప్ సెయిల్‌కాట్ ఫిష్' లలో మగజీవి గ్రుడ్లను తన నోట్లో పొదుగుతుంది. 'అబ్‌స్ట్రైకిల్ కాట్‌ఫిష్' లలో స్త్రీ జీవి నోట్లో గ్రుడ్లు పిల్లలౌతాయి. అలాగే 'ఈజిప్షియన్ మౌత్‌బ్రీడర్' లలో ఆడచేప, టిలాపియాలలో మగ చేప గ్రుడ్లు పిల్లలయే వరకు తిండిమానేసి నోట్లోవుంచుకుని కాపాడుతాయి.

ఆస్ట్రేలియన్ కుర్టెస్ (Kurtus) అనే చేపల్లో మగ జీవి గ్రుడ్లను తన ముఖం మీద వుంచుకుని కాపాడుతుంది. 'స్టికిల్ బాక్' (Stickle back) అనే మగ చేప గూడుకట్టి ఆడ చేపను ఆకర్షిస్తుంది. ఆడ చేప గ్రుడ్లు పెట్టగానే వాటిని ఫలదీకరించి, ఆడ చేపను అక్కడి నుండి తరిమేస్తుంది. గ్రుడ్లు పిల్లలయేవరకూ కంటికి కునుకులేకుండా, తిండి తినకుండా కాపాడుతుంది. వాటికి కావలసిన ఆక్సిజన్ కోసం రెక్కలతో విసురుతుంది. తమ సంతానమంటే ఎవరికైనా ఎంత ఇష్టమో!

చాలావరకు పాములు, తొండల వంటి సరీసృపాలు గ్రుడ్లను బోరియల్లో ఉంచి తమ మానాన తాము పోతాయి. మామూలు తొండలు నేలలో గుంట త్రవ్వి గ్రుడ్లు పెట్టి గుంట పూడ్చేస్తాయి. పాముల్లో గ్రుడ్లకు కాపలా వుండేవి కొండ చిలువ, త్రాచు, రాచనాగు మాత్రమే. వీటిలో కొండచిలువ గ్రుడ్లను చుట్టుకొని కండరాలు వేగంగా కదలించటం ద్వారా వేడిని పుట్టించి గ్రుడ్లను పొదుగుతుంది. పాముల్లో గూడుకట్టేది ఒక్క రాచనాగు మాత్రమే (ophiophagushanna).

అనకొండ, సముద్ర సర్పాలు, పసిరకి పాములు (Green Whipsnake) పిల్లలకు జన్మనిస్తాయి. పాములు తమ గ్రుడ్లను, పిల్లలను తింటాయనటంలో నిజం లేదు. అనకొండ వంటివి నిర్జీవంగా జన్మించిన తమ పిల్లలను భక్షిస్తుంది.

నైలు నది మొసళ్లు మట్టిలో గ్రుడ్లు పెడతాయి. సముద్రపు మొసళ్ళు నీటి ఒడ్డున, నీటి మట్టానికి మూడడుగుల ఎత్తున ఎనిమిది అడుగుల కైవారంతో ఆకులతో గూడు నిర్మించి అందులో గ్రుడ్లు పెడతాయి. కుళ్ళుతున్న ఆకుల నుండి వచ్చే వేడి గ్రుడ్లు పొదగటానికి తోడ్పడుతుంది. తల్లి, తండ్రి, ఇద్దరూ గ్రుడ్లను పర భక్షుల నుండి కాపాడుతాయి. పిల్లలు గ్రుడ్డు నుండి బయటకు రాగానే తల్లి వాటిని నోటిలోకి తీసుకొని, భద్రంగా నీటిలో వదుల్తుంది. అవి తమని తాము కాపాడుకునే వయసు వచ్చే వరకు తల్లి తండ్రి వాటిని కాపాడుతాయి.

సముద్రపు తాబేళ్ళు సముద్రపు ఒడ్డున పొడిగా ఉండే ఇసుకలో పెద్ద గుంట చేసి 140 వరకు గ్రుడ్లు పెడతాయి. గ్రుడ్ల నుండి పిల్లలన్నీ ఒకేసారి బయటకు వచ్చి వీలైనంత వేగంగా సముద్రంలోకి పోతాయి. కాకులు, నక్కలు, గ్రద్దల వంటి వాటికి ఆహారమైనవి పోగా అతి తక్కువ పిల్ల తాబేళ్ళు మాత్రమే పెద్దవౌతాయి. గ్రుడ్లుపెట్టటానికి ఒడ్డుకు వచ్చిన తాబేలుకు, దాని గ్రుడ్లకు ప్రధాన శత్రువు 'మానవుడే'.

ఇప్పుడు మన కందరకూ పరిచయమైన, మనకు ఆహ్లాదాన్నిచ్చే పక్షులలో తల్లీ, బిడ్డల మధ్య సంబంధం ఎలా వుంటుందో చూద్దాం!

''కలికి, రెక్కలు రాని పిల్లలను సాకన్

పెంటియొక చెంత పోతొక చెంత'' అంటూ పక్షుల పిల్లలను తల్లితండ్రి, ఇద్దరూ పోషిస్తారని చెప్పారో కవి. పక్షుల్లో తొంభై శాతం తమ సంతానాన్ని కలిసే పోషిస్తాయి. పిల్లలకు పాలిచ్చిపెంచే జీవులలో మూడు శాతం తండ్రులు మాత్రమే తమ సంతానాన్ని పోషించే బాధ్యత తీసుకుంటాయి.

మన వునికిని లెక్క చేయకుండా మన ఇంట్లో గూడు కట్టే పిచ్చుకలు రెండూ తమ పిల్లలను పోషించటం మనకు తెలిసిందే.

నిప్పుకోళ్ళలో తన భార్యలందరూ పెట్టిన గ్రుడ్లను ఒకే చోటవుంచి మగ నిప్పుకోడి (Ostrech) పొదుగుతుంది. పిల్లలను వెంట బెట్టుకుని తిరుగుతూ శత్రువుల నుండి కాపాడుతుంది.

'ఎంపరర్ పెంగ్విన్స్' లో తల్లి గ్రుడ్డు పెట్టగానే తండ్రి కాళ్ళమీదకు దాన్ని తోస్తుంది. తండ్రి పొట్ట మీద ప్రత్యేకంగా తయారైన చర్మపు ముడత గ్రుడ్డును కప్పుతుంది. ఈ విధంగా రెండు నెలల పాటు మగ ఎంపరర్ పెంగ్విన్ తిండి లేకుండా, నిలువు కాళ్ళమీద గ్రుడ్డును పొదుగుతుంది. ఈ కాలంలో తన ఒంట్లో నిల్వవున్న క్రొవ్వును కరిగించుకుని కాలం వెళ్ళదీస్తుంది. పిల్లబయటకు వచ్చేనాటికి ఆహారానికి వెళ్ళిన తల్లి తిండి తీసుకు వస్తుంది.

'హార్న్‌బిల్ (Hornbill) అనే పక్షుల్లో గ్రుడ్లను, తల్లిని ఒక చెట్టు తొర్రలో వుంచి మట్టితో తొర్రను మూసేస్తుంది మగ పక్షి. ఒక చిన్న రంధ్రం ద్వారా తల్లికి ఆహారాన్ని అందిస్తుంది. పిల్లలు కాస్త పెద్దవయేదాకా తల్లికి ఖైదు, తండ్రికి నిరంతరం ఆహార సరఫరా తప్పవు.

పావురాలు తమ జీర్ణకోశంలో తయారైన పీజియన్ మిల్క్ (Pigeon Milk) అనే ప్రత్యేకమైన బలవర్ధక ఆహారాన్ని తమ పిల్లలకు తినిపిస్తాయి. దీనితో అవి త్వరగా ఎదుగుతాయి.

'గ్రేటర్ ప్లెమింగో' లు సగం జీర్ణమైన ఆహారాన్ని తమ పిల్లలకు తినిపిస్తాయి.

గూడ కొంగలు చేపలను తమ గడ్డం క్రింద ఉండే తిత్తిలో ఉంచి పిల్లలకోసం తెస్తాయి.

'ఈ గరెట్' అనే కొంగల్లో ఆహారం తక్కువగా ఉంటే బలమైన పిల్ల మిగిలిన వాటిని చంపేలా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తాయి.

'స్టార్క్' అనే వేడి ప్రదేశాలలో నివసించే కొంగలు వేడి తగ్గించటానికి గ్రుడ్లపై నీళ్ళు చల్లుతాయి. అదే 'బ్లూఫుటెడ్ బూబీ' (Blue footed booby) 'లిటిల్ రింగ్‌డ్ ప్లోవర్' (little ringed plover) అనేవి గ్రుడ్లమీద కూర్చోవటానికి బదులు ఎండతీవ్రత నుంచి రక్షణగా గ్రుడ్లపై నీడపడేలా నుంచుంటాయి.

పిల్లలకు పాలిచ్చి పెంచే క్షీరదాలలో తల్లి పిల్లల మధ్య అనుబంధం చాలా ఎక్కువ. ఈ అనుబంధం కొద్ది రోజుల నుండి చనిపోయేవరకూ కూడా కొనసాగవచ్చు.

గొరిల్లాల పిల్లలు నాలుగు నెలల దాకా తల్లికి దగ్గరగా వుంటాయి. ఎనిమిది నెలల వయస్సు వచ్చేసరికి తల్లికి దూరంగా గడపటం నేర్చుకుంటాయి.

'రింగ్ సీల్' పిల్లలు రెండు నెలలు పాలుత్రాగితే, 'హార్స్‌సీల్' పిల్లలు పదిహేనురోజుల్లో వేటాడటానికి సిద్ధమౌతాయి.

సముద్రపు సింహం, చిరుతపులి, కోతి, తిమింగలాల పిల్లలు సంవత్సరం పైగా తల్లి వెంటే వుండి పాలు త్రాగుతాయి.

ఎలుగుబంటి పిల్ల రెండేళ్ళు, ఏనుగుపిల్ల మూడేళ్లు, మనిషిపిల్ల సంవత్సరం నుండి ఐదేళ్ళ వయసుదాకా పాలు త్రాగుతాయి.

కుటుంబ జీవితం గడిపే సింహాలలో పిల్లలు ఏ తల్లి దగ్గరైనా పాలుత్రాగ వచ్చు. ఆడ సింహాలన్నీ దగ్గరి బంధువులై వుంటాయి.

ఏనుగుల మందలో అందరికంటే పెద్దదైన అమ్మమ్మ మందకు నాయకురాలు. అమ్మమ్మ ఏనుగు పర్యవేక్షణలో మంద అడవిలో తిరుగుతుంది. మగ ఏనుగులు మాత్రం విడిగా జీవిస్తాయి.

కుటుంబ జీవితం లేని పులులు, చిరుతల వంటి జీవుల్లో పిల్లలకు తల్లి అవసరం ఎక్కువ. గొర్రెల వంటి జీవులు గుంపుగా వున్నా, మందలో ఎలా మసలుకోవాలో తల్లి నేర్పుతుంది. తల్లి లేని పిల్లకు ఇతరులతో ఎలా మసలుకోవాలో తెలీదు. అందుకే తల్లి లేని పిల్లను కాపరులు నిర్దాక్షిణ్యంగా చంపేస్తారు.

పిల్లికి చెలగాటం ఎలుకకు 'ప్రాణసంకటం' అనే సామెత మనకు తెలిసిందే. తన పిల్లలకు వేటాడటం నేర్పటానికి ఎలుకను గాయపరచి పట్టి పిల్లలముందు పడేస్తుంది తల్లి. ఎలుకను స్వయంగా చంపితినటం ప్రయోగాత్మకంగా నేర్చుకుంటాయి పిల్లిపిల్లలు. మాంసాహారుల పిల్లలన్నీ వేటలో మెలకువలు తల్లి నుండి నేర్చుకోవలసిందే. 'ప్రాక్టికల్స్' మానవుల్లోనే కాదు జంతువుల్లోనూ వున్నాయి.

రాజుగారికి ఎందరు భార్యలున్నా పట్టపురాణి సంతానానికే సింహాసనార్హత. అలాగే కుటుంబ జీవితం గడిపే జీవులలోనూ ప్రధాన స్త్రీ జీవి పిల్లలకు గుంపులో హైస్థాయి లభిస్తుంది. దీనివలన ఆహారం, వసతి, రక్షణ మిగిలిన వాటికంటే ముందు లభిస్తాయి. మంచి ఆహారం వల్ల పిల్లలు బలంగా ఎదుగుతాయి. ఒక వేళ తల్లి మరణించినా అవి తమ స్థానాన్ని కాపాడుకోగలవు.

ఓ సంఘటనతో ఈ వ్యాసం ముగిస్తాను.

'నానాఫడ్నవీసు' అనే ఆయన పూనా పేష్వాగా పనిచేసే రోజుల్లో రెండు ఒకే రకమైన ఆడ గుర్రాలలో తల్లి ఏదో పోల్చుకోమన్నాడు గుర్రాల వ్యాపారి. 'నానా' గుర్రాలను నదిలోకి తోలించాడు వాటిలో ముందు ఈదుతూ అవతలి గట్టు చేరినది తల్లిగా నిర్ధారించాడు.

స్వభావ సిద్ధంగా ఎంత పిరికి జీవైనా, తల్లి తన సంతానాన్ని కాపాడు కోవటానికి తిరగబడుతుంది. తన ప్రాణాలు లెక్క చేయకుండా పోరాడుతుంది. తను తినకుండా పిల్లలకు పెడుతుంది. సంతానం స్వతంత్రంగా జీవించాటానికి అవసరమైన శిక్షణ ఇస్తుంది. ఇవన్నీ ఏ ప్రతిఫలం ఆశించకుండానే.

మానవ ప్రపంచంలోనే కాదు ప్రాణి ప్రపంచంలోనూ తల్లి స్థానం అద్వితీయమైనదే.

ఈ విషయంలో ఎవరి అంగీకారం అవసరం లేదు. కదూ !

(ఆకాశవాణి అనంతపురం కేంద్రం ద్వారా ప్రసారం చేయబడినది)

# యుద్ధ భేరీపై నిరసన పత్రం

## పాబ్లో పికాసో - గుయెర్నికా

- కాండ్రేగుల నాగేశ్వరరావు

చిత్రకళాజగత్తులో మకుటంలేని మహారాజుగా, తన జీవితకాలంలోనే తానొక చారిత్రకపురుషునిగా వెలుగొందినవాడు - పాబ్లో పికాసో. స్పెయిను దేశపు 'మలగా' లో 1881వ సంవత్సరంలో జన్మించిన పికాసో 20వ శతాబ్దపు ప్రారంభం నాటికి 19 సంవత్సరాల వయసు కలిగిన నూనూగు మీసాల నవయువకుడు. తన 8వ యేటనుంచి 91వ యేట మరణించే 18 గంటల ముందు వరకూ అప్రతిహతంగా రంగుల హరివిల్లును చిత్రకళాజగత్తుపై చిలకరించిన రసగంగాధరుడతను. అతని చిట్టచివరి పెయింటింగ్ అయిన **'విశ్రాంతి తీసుకుంటున్న నగ్నస్త్రీ'** అన్న చిత్రం అతను సమాధి చేయబడిన రోజునే ప్రజల దర్శనార్థం మ్యూజియంకు తరలించే సమయానికి దాని రంగులింకా ఆరలేదు. (రెండవ అట్టపై క్రింది చిత్రం).

నిస్సందేహంగా 20వ శతాబ్దపు అత్యంత ప్రతిభావంతుడైన చిత్రకారుడతను. చిత్ర కళలోనే కాదు, శిల్పంలో, కవిత్వంలో కూడా అనన్య సామాన్యమైన ప్రతిభను ప్రదర్శించాడు. అతని చిత్రాలలోనే కాదు, 20వ శతాబ్దపు చిత్రాలలోనే తలమానికమైనది అతను చిత్రించిన **గుయెర్నికా.** ఈ చిత్రాన్ని విశ్లేషించి అర్థం చేసుకోవాలంటే పికాసో జీవితం, స్పెయిన్ దేశపు సమకాలీన రాజకీయ చరిత్ర తెలుసుకోవటం చాలా ముఖ్యం.

పికాసో తండ్రి డాన్‌జాయిస్ రూయిజ్ (Don jose Ruiz) పేరున్న చిత్రకారుడేకాక స్పెయిన్‌లోని ఒక మ్యూజియమ్‌కు సంరక్షకుడు కూడా. తల్లి పేరు డొన మారియా పికాసో (Don Maria Picasso). చిన్నప్పుడు తండ్రితో బాటు ఆదేశపు క్రీడగా భావించబడుతున్న బుల్‌ఫైట్ ( ఒక ఎద్దుకు, ఒక వీరునికి మధ్య పోరాటం, ఈ పోరాటంలో పాల్గొనే వానికి ఒక ఎఱ్ఱటి గుడ్డ, కొన్ని బల్లెములు ఇస్తారు. గుడ్డతో ఆ ఎద్దును రెచ్చగొడుతూ, బల్లెములతో పొడిచి చంపటం. ఈ క్రీడ (ఇందులో ఎప్పుడో ఒకసారి పాల్గొనే వ్యక్తి మరణించటం కూడా జరుగుతుంది) కు వెళ్ళేవాడు. ఇందులో పాల్గొనే ఎద్దు శౌర్యంతో పోరాడి, మరణించి, వీరత్వానికి చిహ్నంగా అతను ఈ ఎద్దును అనేక చిత్రాలలో ఉపయోగించుకున్నాడు. మొట్టమొదటి సారిగా తన 8వ యేట అతను వేసిన చిత్రాలు ప్రదర్శించబడ్డాయి. ఇతను ఒక బాల మేధావిగా గుర్తించ బడ్డాడు. కుమారుని ప్రతిభను గుర్తించిన తండ్రి పికాసో యొక్క 13వ జన్మదినం నాడు అతనికి తానుపయోగించిన కుంచెలు, రంగులు, వాటిని కలుపుకునే పేలెట్‌ను ( రంగులను కలుపుకునే పళ్లెం) బహూకరించి, తాను చిత్రాలు వేయటం మానుకున్నాడు. ఇది ఒక కన్న తండ్రి, తన కుమారుని దీవిస్తూ చేసిన ఒక చిత్రమైన నివాళి.

ఆనాటి అందరి వర్ధమాన చిత్రకారుల వలెనే పికాసో కూడా చిత్రకళలో తన ప్రావీణ్యానికి మరింత మెరుగులు దిద్దుకోవటం కోసం 1900వ సంవత్సరంలో పారిస్ నగరానికి చేరుకున్నాడు. అప్పటి

---

కాండ్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో అడిషనల్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. కళ, సాహిత్యాలు అభిమాన విషయాలు.

నుంచి ఇంచు మించు అతను పారిస్ నగరంలోనే ఉంటూ, అప్పుడప్పుడు స్పెయిన్ దేశానికి, ముఖ్యంగా బార్సిలోనా నగరానికి వచ్చి వెళుతూ ఉండేవారు. 1904వ సంవత్సరము నుండి పారిస్ నగరంలోనే ఉండిపోయాడు. అప్పటి నుండే అతను తన తండ్రి ఇంటిపేరును వదలి తల్లి ఇంటి పేరైన పికాసోను తన పేరు చివర చేర్చుకొని 'పాబ్లో పికాసో'గా పిలువ బడ్డాడు. దీనికి స్పష్టమైన కారణాలు తెలియవు.

1901వ సంవత్సరంలో సుమారు మూడు సంవత్సరాల పాటు, అతని జీవితంలో అత్యంత రసవత్తరమైన నీలిరంగు దశ (Blue period) ప్రారంభించబడినది. అతనిపై విరుచుకుపడే విమర్శకులు కూడా ఇది అత్యంత ఉత్కృష్టమైన దశగా పేర్కొంటారు. ఈ కాలంలో అతను వేసిన చిత్రాలన్నీ నీలంరంగు నేపథ్యాన్ని పొంది ఉంటాయి. దీని తరువాత మరికొంత కాలం గులాబీరంగు (Pink period) దశ జరిగింది. ఆ తరువాత ప్రతీకలను చిత్రాలలోనికి తీసుకొనివచ్చిన ఘనవాద (Cubism) చిత్రాలు వేశాడు. ఇది అతను తన మిత్రుడైన బ్రేక్ (Braque)తో కలసి ఆవిష్కరించాడు. ఈ ఘన వాద శైలి అతని జీవితంలో ఎక్కువ భాగాన్ని ఆక్రమించి, 'పికాసో' అంటేనే ఘనవాదం అనేంత వరకు వెళ్ళింది. ఈ శైలికి అంతర్జాతీయ గౌరవాన్ని తీసుకొని వచ్చింది పికాసో యే. ఇంకా తన సుదీర్ఘ జీవితంలో అనేకానేక పోకడలకు పోయినప్పటికీ ముఖ్యమైనవి ఈ మూడు దశలు మాత్రమే.

ఇదిలా ఉండగా 1931వ సంవత్సరంలో రష్యా సహాయంతో స్పానిస్ డెమొక్రాటిక్ పాపులర్ ఫ్రంట్ పార్టీ స్పెయిన్‌లో అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత కాలంలో ఆ ప్రభుత్వం చేపట్టిన భూ సంస్కరణలు, సోషలిస్టు విధానాలు సహజంగానే భూస్వాములు, కేథలిక్ చర్చిల యొక్క ఆగ్రహానికి తావిచ్చింది. ఇదే సమయంలో స్పెయిన్ సైనిక విభాగం నుండి ఫ్రాన్సిస్ ఫ్రాంకో అనబడే అధికారి, అత్యంతగౌరవ హోదా నుండి తప్పించబడి చివరి సారిగా 1935వ సంవత్సరంలో పదవీచ్యుతుడైనాడు. ఫ్రాంకో తనను పదవి నుండి తొలగించిన పాపులర్ ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నంలో ఇటలీ అధినేత ముస్సోలిని, జర్మనీ నియంత హిట్లర్‌తో చేతులు కలిపి స్పెయిన్‌లో అంతర్యుద్ధానికి అంకురార్పణ చేశాడు. దీనికి నాందిగా బిస్కేగల్ఫ్‌లోని గుయెర్నికా అనబడే చిన్న పల్లెను ఎంచుకొని, కేవలం తన ప్రత్యర్థులను భయభ్రాంతులను చేసి తన వైపుకు స్పానిష్ ప్రజలను తిప్పుకొనడానికి ఏప్రిల్ 16వ తేదీ 1936వ సంవత్సరంలో జర్మనీ సైనిక సహకారంతో బాంబులతో అమానుషమైన దాడి జరిపాడు.

ఈ దాడిలో 1684 మంది మరణించగా, 809 మంది గాయపడ్డారు. ఇందులో ఎక్కువ భాగం ముసలివారు, స్త్రీలు, పిల్లలు. ఈ ఘాతకానికి సంబంధించిన ఛాయాచిత్రాలు 'Cesoir' అనే పత్రికలో ప్రచురించబడ్డాయి . పారిస్‌లో పికాసో ఈ సంఘటనచూసి చలించి పోయాడు. ఫ్రాంకోను రాక్షసునిగా చిత్రిస్తూ చిత్రాలు గీశాడు. Dreams lies of Franco అనే పేరుతో గేయాలు వ్రాశాడు. పికాసో స్పెయిన్‌లో ఎన్నికల ద్వారా రాజ్యానికి వచ్చిన డెమోక్రాటిక్ పాపులర్ ఫ్రంట్ ప్రభుత్వాన్నే తన తుది శ్వాస వరకూ సమర్థించాడు.

జోస్ బెర్గ్‌మన్ (Jose Bergman)అనే స్పానిష్ కవి పారిస్‌లో ఉన్న స్పెయిన్ దౌత్యసంబంధ కార్యాలయంలో పనిచేస్తున్నారు. అతను పికాసోకు చిరకాల మిత్రుడు. 1937 జులైలో ప్రారంభం కానున్న పారిస్ ప్రపంచ వ్యాపార సంతకు (Paris World Fair) స్పానిష్ పెవిలియన్‌లో ప్రదర్శనకు అద్భుతము, ఆశ్చర్యజనకమైన ఒక పెద్ద చిత్రాన్ని నభూతో అన్నట్లుగా ప్రతిష్ఠాత్మకమైన ఒక చిత్రాన్ని వేయమని కోరాడు. అందుకు గాను ఒకలక్ష యాభైవేల ఫ్రాంకులు పికాసోకు ముందుగానే అందజేయబడ్డాయి. దీనికి వస్తువేమిటన్నది చిత్రకారుని ఇష్టానికే వదలి వేశారు. దీనిపై ఏ విధమైన నిబంధనలూ పెట్టలేదు. మొదట పికాసో తన స్టూడియోలో చిత్రకారుడు, నగ్నస్త్రీ అనే ఇతి వృత్తాన్ని తీసుకొని చిత్రం వేయదలచాడు. కానీ వెంటనే మనసు మార్చుకొని ఈ శతాబ్దానికే తలమానికంలా నిలిచే ఒక సంఘటనను చిత్రీకరించాలని భావించి వస్తువుగా గుయెర్నికాలో జరిగిన మారణహోమాన్ని ఎన్నుకున్నాడు. మే 1, 1937వ సంవత్సరంలో సుమారు 30 అడుగుల పొడవు, 12 అడుగుల ఎత్తుగల ఒక అతి పెద్ద కాన్వాస్‌పై చిత్రీకరణ ప్రారంభించి సుమారు 45 రోజులలో అంటే జూన్ 15వ తేదీ నాటికి ఈ చిత్ర రచనను పూర్తిచేశాడు. ఈ చిత్రం స్పానిష్ పెవిలియన్‌లో జులై 1వ తేదీ నుండీ ప్రదర్శనకు ఉంచ బడింది.

డాన్‌మోర్ అనేపేరుగల పికాసో ప్రియురాలు తీసిన గుయెర్నికా విధ్వంసపు ఛాయా చిత్రాలను ప్రేరణగా తీసుకొని దానిని తనదైన శైలిలో 64 చిత్తు ప్రతులను వేసుకొని వాటిని చివరకు 9 ప్రతిరూపాలుగా మార్చుకున్నాడు. ఈ చిత్రం మొత్తం తెలుపు, నలుపు రంగులలో వాటికి సంబంధించిన మిశ్రమ ధాతు వర్ణంలో వుంటుంది. ఈ చిత్రానికి వేసుకున్న చిత్తు ప్రతి రంగులలో వేసుకున్నా, అంతిమంగా ఈ చిత్రం తెలుపు, నలుపులలోనే ఎక్కువ ఆకట్టు కుంటుందని, రంగుల ద్వారా ఏర్పడే శోభ చిత్రంలోని యుద్ధ భీబత్సాన్ని తగ్గిస్తుందని పికాసో కవి మిత్రుడైన పాల్ యెలార్డ్ అభిప్రాయంతో పికాసో ఏకీభవించి దీనికి రంగులు అద్దటం మానుకున్నాడు.

అయినప్పటికీ ఎరుపు రంగు గల ఒక అట్టతో ఒక పెద్ద కన్నీటి బొట్టును కత్తిరించి ఒక ఖండిత స్త్రీ కంటినుంచి వస్తున్నట్లుగా తయారు చేసి తరువాత విరమించుకున్నాడు.

ఇక చిత్రానికి వస్తే ఇది వేసే సమయానికి పికాసో పూర్తిగా ఘనవాదానికి (Cublism) లోబడి వున్నాడు. అందుచేత ఈ చిత్రంలో మొత్తం 9 సింబల్స్‌ను ఆవిష్కరించాడు. ఒక భీబత్సమైన సంఘటన జరుగుతున్నపుడు సామాన్యంగా ప్రజలు దిక్కు తోచని పరిస్థితులలో చెల్లా చెదురుగా పరుగెత్తుతారు. అదే విధంగా ఈ చిత్రంలో కూడా చెల్లా చెదురు చేయబడి కాన్వాస్ మూలమూలలకు వ్యాపించిన ప్రతీకలు కనిపిస్తాయి. ('మిసిమి' ముఖచిత్రం చూడండి).

ఇందులో వ్రాయబడ్డ 9 ప్రతీకలు ఎడమనుండి కుడివైపుకు, పైనుండి క్రిందకు, వాటివివరణ :

1. తలకొట్టి వేయబడ్డ ఎద్దు ముఖం.

2. దానిక్రింద పొత్తిళ్ళల్లో మృత శిశువును పెట్టుకొని విరిగిపోయిన మెడతో ఆక్రోశిస్తున్న స్త్రీ.

3. ఈ రెండు రూపాల క్రింద విరిగిపోయిన ఒక గ్రీకు శిల్పం యొక్క తల.

4. సూర్యుని తల పింపచేస్తూ భీకరమైన కాంతిని ప్రసరిస్తున్న ఒక విద్యుత్ దీపం. అయినప్పటికీ ఆకాంతి దీపం చుట్టూ ఒక చక్రాకార వలయానికి మాత్రమే పరిమితమవటంవలన గదిలోని చీకటి అలాగే ఉంటుంది.

5. బాధతో రోదిస్తున్న గుఱ్ఱం. ఒక ముల్లులా, పదునైన భల్లెం మొనలా కనిపించే ఆ గుఱ్ఱపు నాలుక, గుఱ్ఱానికీ ఎద్దు ముఖానికి మధ్య నోరు తెరుచుకొని మరణించిన ఒక పక్షి అస్పష్టంగా.

6. దాని ప్రక్కగా తలుపు తెరచుకొని కొవ్వొత్తి పట్టుకొని వున్న ఒక విరిగిన చెయ్యి.

7. ఆ వెలుగులో భీతవాహ అయి చీకటి నుండి వెలుగును వెత్తుక్కుంటున్న ఒక ఖండిత స్త్రీ తల.

8. వెలుగును వెతుక్కుంటూ వస్తున్న స్త్రీ.

9. ఇక చివరిగా ( కుడివైపున) ఒక స్థంభం క్రిందపడి ఆశగా కిటికీలోనుంచి వచ్చే వెలుతురును చూస్తూ ప్రాణాలొదిలిన స్త్రీ మూర్తి.

ఇవికాక అస్పష్టంగా, అస్తవ్యస్తంగా కొన్ని రేఖా విన్యాసాలు. ఒక భయానక సన్నివేశాన్ని హృదయానికి తాకేలా చిత్రించటంలో పికాసో కృతకృత్యుడైనాడు. ఈ చిత్రంలో యుద్ధ భీబత్సం, క్షతగాత్రుల హాహాకారాలు మనకు స్పష్టంగా కనిపిస్తాయి. మిషన్ గన్‌లు, బాంబులు కనిపించక పోయినా వాటి వికటాట్ట హాసం ఈ చిత్రం చూస్తున్నంత సేపూ మనకు నేపథ్యంలో లీలగా వినిపిస్తూనే వుంటాయి. బాంబుల వల్ల విద్యుత్ దీపం ఛిన్నా భిన్నమై ఆరిపో బోయేముందు చివరి సారిగా కాంతిని ప్రసరించి చీకట్లు వెదజల్లుతున్నట్లుగా వుంటుంది. మొత్తం చిత్రంలోని ప్రతీకలన్నీ ఒక రక్తయజ్ఞంతో తడసినట్లుగా వుంటుంది.

ఈ చిత్రాన్ని ప్రదర్శనకు పెట్టినపుడు, దానిని చూసిన స్పెయిన్ దేశస్థులు పొంగి పొరలే దుఃఖాన్ని ఆపుకోలేక కంట తడిపెట్టారు. 1937వ సంవత్సరంలోనే ఆనాటి కళా విమర్శకులు దీనిని ఈ శతాబ్దపు (20వ) (శతాబ్దం పూర్తికావడానికి ఇంకా 63 సంవత్సరాలు గడవాలి) అత్యున్నత సృష్టిగా కొనియాడారు. కొద్ది రోజుల్లోనే ఈ చిత్రం యొక్క కీర్తి నలుదిశలా వ్యాపించింది. కేవలం ఈ చిత్రాన్ని చూడడానికే దేశ దేశాల నుండి ప్రజలు తండోప తండాలుగా వచ్చారు. ప్రపంచ తిరునాళ్ళలో ఎక్కడ చూసినా దీని గురించే చర్చ. ప్రజలు ఈ చిత్రానికీ, చిత్రకారునికీ అభినందన మాలలర్పించారు. ఊహించని ఈ ప్రజామోదాన్ని చూసిన పికాసో కవి మిత్రుడైన పాల్ యోలార్డ్ (Paul Elardo) 'గుయెర్నికా విజయం' అనే పేరుతో స్పానిష్ భాషలో ఒక గేయాన్ని వ్రాశాడు. చిత్రకళా ప్రపంచంలో లియనార్డో డావిన్సీ వేసిన మోనాలిసా, పికాసో యొక్క గుయెర్నికాపై వచ్చినన్ని వ్యాసాలు మరే చిత్రాల మీద రాలేదు. ముఖ్యంగా గుయెర్నికా పై వచ్చిన వ్యాసాలు కొన్ని వందలు దాటి వుంటాయి. ఆంగ్ల భాషలో షేక్సుపియర్ వ్రాసిన 'హామ్లెట్'పై ఇప్పటికింకా వ్యాస పరంపరలు వస్తున్నట్లుగానే గుయెర్నికాపై ఎప్పటికప్పుడు కొత్తకోణాలు ఆవిష్కరింప బడుతున్నాయి. అయితే ఇందులో కొన్ని వితండవాదనలు కూడా లేక పోలేదు. రోదిస్తున్న గుఱ్ఱం తల వెనుక ఒక మానవ కపాలం వున్నట్టుగా ఒక విమర్శకుడు పేర్కొంటే అటువంటి దేమీలేదని దీనిలో కేవలం 9 ప్రతీకలు మాత్రమే వున్నాయని పికాసో పేర్కొన్నాడు. లేనిపోని కొత్త వివరణలు వచ్చినపుడు పికాసో వాటిని తేలికగా కొట్టిపారేశాడు. దీనికి

లభించిన ప్రాచుర్యం ఫ్రాంకోకు కన్నెత్తై పికాసో హత్యకు ప్రయత్నించే వరకూ వెళ్ళిందీ వ్యవహారం. 1939వ సంవత్సరంలో ఫ్రాంకో అంతర్యుద్ధంలో విజయం సాధించి తాను స్పానిష్ దేశపు శాశ్వత అధిపతిగా తనకు తానుగా నిర్ణయించుకొని ఒక చట్టం ద్వారా స్పానిష్ ప్రజల నెత్తికెక్కి కూర్చున్నాడు.

ఫ్రాంకోపై, అతని విధానాలపై శాశ్వత శతృత్వం పెంచుకున్న పికాసో తాను ఫ్రాంకో బ్రతికి వున్నంత కాలం స్పెయిన్‌లో కాలు పెట్టకూడదని నిశ్చయించుకున్నాడు.

దురదృష్టవశాత్తు పికాసో ఫ్రాంకో కంటే రెండు సంవత్సరాల ముందుగా 1973లో మరణించాడు. (ఫ్రాంకో 1975లో మరణించాడు). 73 సంవత్సరాలుగా తనకు ఆశ్రయమిచ్చిన ఫ్రాన్స్ దేశానికి వెలకట్టలేని వేలకొలది చిత్రాలను బహుమతిగా ఇచ్చి రుణం తీర్చుకున్నాడు. అతని చిత్రాల విలువ మానవ ఊహకు అందనిది. ఉదాహరణ ఇవ్వాలంటే, కేవలం ఒక్క చిత్రాన్ని అమ్మి ఆవచ్చిన డబ్బుతో దక్షిణ ఫ్రాన్స్‌లో ఒక భవంతిని కొనగలిగాడు పికాసో).

మొదటి ప్రపంచయుద్ధం ముగిసి రెండు దశబ్దాలు గడవకుండానే తిరిగి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ చిత్రానికి యూరోప్‌లో భద్రత లేదని దీనిని అమెరికాలోని న్యూయార్క్ నగరంలోని మ్యూజియం ఆఫ్ మోడరన్ ఆర్ట్‌కు ఈ చిత్రం 1939లోనే తరలించబడింది. అయితే పికాసో తన విల్లులో ఈ చిత్రాన్ని శాంతి భద్రతలు నెలకొన్న తరువాత దీనిని తన మాతృదేశమైన స్పెయిన్‌కు తరలించమని కోరాడు. దీనికి అనుగుణంగానే 1981వ సంవత్సరంలో న్యూయార్క్‌లోని మోడరన్ మ్యూజియమ్‌నుండి ఒక ప్రత్యేకమైన విమానంలో గుయెర్నికా తనకన్న తండ్రి గడ్డపై కాలుమోపింది. మాడ్రిడ్ లోని (Madrid) పార్డోమ్యూజియమ్‌కు ఆనుకొనివున్న స్పానిష్ రాజకుటుంబీకుల భవనంలో బుల్లెట్ ప్రూఫ్ గాజు వెనుక గట్టి భద్రతా ఏర్పాట్ల మధ్య ఆనాటి నుండి ఈనాటి వరకూ గుయెర్నికా ప్రదర్శించ బడతూ వస్తుంది.

గుయెర్నికాలాంటి మరొక చిత్రాన్ని రెండవ ప్రపంచ యుద్ధానంతరం చార్లెస్ హౌస్ (Charless House) అనే పేరుతో 1944లో పికాసో చిత్రించాడు. జాత్యహంకారైన హిట్లర్ యూదులను నిర్ధాక్షిణ్యంగా చంపి గుట్టలు గుట్టలుగా పడవేసిన సంఘటనకు సంబంధించిన ఛాయాచిత్రాలు దీనికి ప్రేరణ. ఇది కూడా తెలుపు, నలుపు, వాటి మిశ్రమ ధాతువుతో వేయబడ్డ చిత్రమే. ఇది 6 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పు కలిగిన చిత్రం. ప్రస్తుతమిది న్యూయార్క్‌లోని మ్యూజియమ్ ఆఫ మోడరన్ ఆర్ట్ (MOMA)లో ప్రదర్శించబడుతుంది. ఈ చిత్రంలోని ప్రతీకలు పిరమిడ్ ఆకారాలలో పొందికగావించ బడ్డాయి. క్రింద పురుషులు, ఆపై స్త్రీలు, ఆపై పిల్లలూ చిత్రించబడ్డారు. ఏమైనప్పటికీ గుయెర్నికాకు లంభించిన ప్రాచుర్యం దీనికి లభించలేదు.

అనంతమైన ప్రక్రియా వైవిధ్యంతో చిత్రకళా క్షేత్రాన్ని సుసంపన్నం చేసినవాడు పికాసో. అతను కాన్వాస్ పైనే కాదు, కుండలపై, చెక్కలపై, చర్మాలపై, పింగాణిపై, గోడలపై చిత్రాలు గీశాడు. అతను చేయని ప్రయోగం లేదు, తాకని అంచుల్లేవు. అతను, తాను అమితంగా ప్రేమించిన తనకంటే ముందు తరంవారైన మానెట్, ఇంగ్రెస్‌లలాంటి వారి సృజనాత్మక చిత్రాలను తనదైన ఘనవాద (క్యూబిజం) శైలిలో అనుసృజనగావించి తనకు వారిపైగల ప్రేమాభిమానాలు చాటుకున్నాడు.

రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన వెంటనే వెల్లివిరిసిన స్వేచ్ఛా భావాలతో అతను విశృంకలంగా జీవించినా, కపటం ఎరుగని నిజాయితీ, పారదర్శక జీవితం, మానవతా దృక్పథం అతన్ని ప్రపంచ పౌరునిగా, 20వ శతాబ్దపు అత్యున్నత కళాకారునిగా కీర్తి శిఖరంపై నిలబెట్టాయి.

మహాకవి శ్రీశ్రీ, రాచకొండ విశ్వనాథశాస్త్రి ఆరుసారాకథలకు మొదటి మాట వ్రాస్తూ ''ఏక కాలంలో అనేక రసాలను ఉప్పొంగింప జేసే కళాఖండాలను మాత్రమే నేను ఉత్కృష్ట రచనలుగా అంగీకరిస్తాను. కథలో, కవిత్వంలో, శిల్పంలో, చిత్రాలలో, నవలల్లో, నాటకాల్లో నేను ఇటువంటి రసానుభూతినే అన్వేషిస్తాను ..... పికాసో రచించిన గుయెర్నికా నాలో ఒక్క సారిగా నవ్వు, ఏడుపూ, ఆశ్చర్యమూ, భయమూ కలిగించాయి ..... ఇటువంటి రసస్పందనలే నాకు ఈనాటికీ ఉత్తేజం కలిగిస్తాయి.''

ఈ మహాకవితో ఏకీభవించని కళా హృదయుడుండడు.

ఈ వ్యాసం పూర్తి చేసిన తరువాత (మే,2004) మార్కెట్‌లోకి Russell Mantor అనే రచయిత వ్రాసిన 'Picassos War' అన్న పుస్తకం వచ్చింది. (Pocket Book Publication) ఆ పుస్తకంలో రచయిత చెప్పిన కొన్ని విషయాలు :

Europe descended into madness and Guernica travelled the world in protest. In London in 1938 visitors to this painting had to bring boots for needy Spanish Republican soldiers and in 1960 it was favoured back drop for anti victnam Demonstrations.

In February 2003 a reproduction of Guernica that hangs in the United Nations Head quarters in New York had to be concealed so that Colenpowell could present the case for war with Iraq. Today few doubt that Picasso's Guernica is a master piece with the power to change the minds and lives.

గుయెర్నికాను చూసిన లండన్ నివాసులు స్పెయిన్ సైనికులకు బూట్లు పంపించారు. 1960లో వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా గుయెర్నికా చిత్రాన్ని నేపథ్యంగా ఉపయోగించారు. ఇటీవలి కాలంలో కోలన్ పావెల్ అమెరికా రక్షణ మంత్రి ఐక్యరాజ్య సమితిలో ఇరాక్‌పై యుద్ధాన్ని సమర్థించుకోవడానికి ప్రసంగం చేసినపుడు, ఐక్యరాజ్య సమితిలో ఉంచబడ్డ గుయెర్నికా నకలు ప్రతిపై గుడ్డ కప్పి ఉంచారు. మనస్సులనూ, జీవితాలను స్పందింప జేసే శక్తి గుయెర్నికాకు కలదనటం నిర్వివాదాంశం.

గుయెర్నికా చిత్రపటం తన చిత్రంనిండా భీబత్సమైన దృశ్యాలను నింపుకొన్నా దానికి భిన్నంగా శాంతి సందేశమివ్వటం, శాంతికి ప్రతీకగా దానిని ప్రపంచ జనులు భావించటం ఒక విశేషం. వేదనమూ, బాధను ఘన విధానం చూపించేటంత గాఢంగా మరే ఇతర చిత్రకళా శైలి చూపలేదని పికాసో భావించాడు, నిరూపించాడు. ఘన విధాన రూప శైలి గౌరవం ఇటువంటి చిత్రాలవల్ల మరింత ఇనుమడించింది.

# సమసమాజంలో మానవాత్మ

మూలం : ఆస్కార్ వైల్డ్ అనువాదం : సర్దేశాయి తిరుమల రావు

(గత సంచిక తరువాయి)

రచన బాగా వుంటే ఆధ్యాసలో ఆత్మ వినాశ హేతువైన అజ్ఞాన జనిత అహంకారాన్నీ, పరిజ్ఞాన జనిత అహంకారాన్నీ మరచిపోవలెను. నాటకం గురించిన కీలకం తగినంతగ గుర్తింపబడలేదు. నేటి లండను ప్రేక్షకుల సమక్షాన ''మాక్బెత్తు'' నాటకాన్ని మొదటి సారిగా ప్రదర్శిస్తే, వచ్చిన జనంలో చాలామంది మొదటి అంకంలో వికారపు వాక్యాలు, అపహాస్యకరమైన మాటలూ, పలికే మంత్రగత్తెలు రావడానికి తీవ్రమైన అభ్యంతరం తెలుపుతారనేది అర్థం చేసుకోగలను. కానీ నాటకం అయిపోయిన తర్వాత ''మాక్బెత్తు'' లోని మంత్రగత్తెలనవ్వు ''లియరు'' నాటకంలోని ఉన్మత్తుని నవ్వు అంతటి భయంకరమనీ మూర్ జాతివాని ప్రాసదంలో* అయగో నవ్వుకంటే భయంకరమని తెలియవస్తుంది. ఏ ఇతర కళారాధకునికీ నాటక ప్రేక్షకునికి కంటె ఎక్కువ రసగ్రహణ పారీణత అక్కరలేదు. కళమీద అజమాయిషీచేయవలెనని అనుకొన్న తక్షణమే ప్రేక్షకుడు కళకు తేటతెల్లమైన శత్రువవుతాడు. కళ ఏమీ పట్టించుకోదు. నష్టపోయేది వాడు.

నవల విషయమూ ఇంతే. ప్రజల ఆధిపత్యమూ ప్రజల ఆధిపత్యానికున్న పరిగణనా, మరణాంతకాలు. థాకరే ''ఎస్మండ్'' సుందర కళా ఖండము. దానినతడు తన తృప్తికే వ్రాసినాడు. ఇతర నవలలైన ''పెండెన్నిస్'' ''ఫిలిప్'' ''వానిటీ ఫేర్'' లను కూడా, ప్రజధ్యాస మూలకంగా, ప్రజల సానుభూతిక్రరులు చూస్తూనో లేక ప్రజలను వెక్కిరిస్తూనో, రచనలని చెడగొట్టుతాడు. నిజమైన కళాకారుడు ప్రజలను ఏమాత్రమూ సరకుగొనడు. అతని దృష్టిలో ప్రజలనే వాళ్ళేలేరు. ఈ భూతాలని నిద్రపుచ్చేందుకు లేక తృప్తి పరచేందుకు అతనివద్ద తేనెలో అద్దిన దిబ్బరొట్టెలేవీ లేవు. అటువంటి వ్యాపకాన్ని జనరంజక నవలాకారునికి వదులుతాడు. నేడింగ్లాండులో మనకున్న అసదృశ నవలాకారుడు జార్జిమెరిడిత్తు. ఫ్రాన్సులో నింత కన్న మంచి కళాకారులున్నారు. కానీ జీవిత దృక్పథమింత విశాలంగా, ఇంత వైవిధ్యంగా, ఇంత భావనాత్మక సత్యంగా ఉన్నవారు ఫ్రాన్సులో లేరు. నవలలో బాధ అంటే ఏమి అనే విషయంలో ఇంతకన్న తీక్షమైన బుద్ధికల కథాకారులు రష్యాలో వున్నారు. నవలాతత్వం మాత్రం ఇతనికే చెందుతుంది. అతని పాత్రలు కేవలం జీవించడమేకాదు. మనస్సులో నిల్చిపోతాయి. వాటిని దృక్పథంలో చూడవచ్చు. అవి , వివిధ భావస్ఫోరకాలు. వాటిలో ఆత్మవుంది. వాటిచుట్టూ కూడా ఆత్మ ఉంది. అవి కళాత్మక వివరణాలుగా సంకేతాలుగా ఉంటాయి. ఈ అద్భుత చైతన్యవంతమైన పాత్రలు సృష్టించిన యాతడు తన ఆనందం కోసమే అట్లు చేసినాడు. ప్రజలను మీకేమి కావలెనని అడుగనూ లేదు. వారికేమి కావలెనో తెలిసికొన లక్ష్యపెట్టనూ లేదు. తనను ఇట్లు రచించుమని ప్రజలచే చెప్పించుకొనలేదు. ప్రజలు తనను ప్రభావితం చేయనివ్వలేదు. తన వ్యక్తిత్వాన్నే దృఢతరం చేసుకుంటూ తనవే అయిన రచనలు చేస్తూ పోయినాడు. మొదట ఆయన దగ్గరకెవరూ రాలేదు.

---

* షేక్సుపియర్ వ్రాసిన ''ఒథెల్లో'' నాటకం

---

కీ॥ శే॥ డా॥ సర్దేశాయి తిరుమలరావు, (1928 - 1994) ప్రముఖ సాహిత్య విమర్శకులు

దానికేమి ఫర్వాలేదు. తర్వాత కొద్ది మంది వచ్చినారు. దానివల్ల ఆయన మారలేదు. ఇప్పుడు చాలామంది వస్తున్నారు. ఆయన అట్లే ఉన్నాడు. ఆయన అసదృశ నవలాకారుడు.

అలంకరణ కళల్లోకూడ వేటేవిధంగా లేదు. ప్రజలు దయనీయమైన పట్టుదలతో మహావస్తు ప్రదర్శన* యొక్క అంతర్జాతీయ అసభ్యతా సంప్రదాయాలను అంటిపెట్టుకొనివున్నట్లు నా నమ్మిక. ఈ సంప్రదాయాలెంత హడల గొట్టేవంటే గృహాలు, గ్రుడ్డివారు మాత్రమే నివసింపగల్గినట్టివి. సుందర వస్తువులు తయారుకాప్రారంభించెను. అద్దకం పనివాని నుంచి అందమైన రగులు వచ్చినాయి. కళాకారుని నుండి అందమైన నమూనాలు వచ్చినాయి. సుందర వస్తు వినియోగమూ, వాటి విలువ, వాటి ప్రాముఖ్యమూ నిర్ధారింపబడినవి. ప్రజలు నిజంగా రెచ్చిపోయిరి. సహనం కోల్పోయిరి. అవాకులూ, చవాకులూ వాగినారు. ఎవరు ఖాతరు చేయలేదు. ఎవనిది పోయేదేముంది? ప్రజాభిప్రాయపు పెద్దరికాన్ని ఎవరూ ఒప్పుకొనలేదు. ఈనాడు కొంతైనా మంచి అభిరుచిని పసికట్టకుండా కొంతైనా అందమైన పరిసరాలు ఆవశ్యకతను గుర్తుపట్టకుండా కొంతైనా సౌందర్యాన్ని మెచ్చుకొనే పోకడలను పసికట్టకుండా, కొత్త ఇండ్లలోకి పోవుట అసాధ్యం. జనుల ఇండ్లు, ఇటీవల కాలంలో చాలా ముచ్చట గొల్పుతున్నాయి. ప్రజలు ఎంతో నాగరికులైనారు. గృహాలంకరణ, బల్లలు, కుర్చీల విషయంలో పరిణామ విజయానికి కారణం ప్రజలు అటువంటివానిలో అభిరుచి పెంపొందించుకొనుట వలన కాదని చెప్పితే సమంజసంగా ఉంటుంది. హస్తకళాకారులు అందమైన వస్తువులు చేయుటలోని ఆనందంను గ్రహించగలిగి, ప్రజలు కావలెననే వస్తు సామగ్రిలోని వికృతాలు, అసక్రమాలచేత కన్నులు తెరువబడి. ప్రజలకావస్తువుల చేసిచ్చుట మానేసి వారికావస్తువులు లేకుండా చేసినందువల్లనే ఇది సాధ్యమయింది. ప్రస్తుతం గదులను కొద్ది కాలం క్రిందటి బల్లలు కుర్చీలవే అమర్చుట సాధ్యంకాదు. మూడవ శ్రేణి విశ్రామ గదులనుంచి చేతులు మారిన సామగ్రిని వేలంపాట పాడి, తెచ్చికొని వీటిని అమర్చలేము. వారెంత అభ్యంతరం చెప్పినా, ప్రజలకు పరిసరాలలో ముచ్చటగొలిపేవి ఉండవలెను. అదృష్టవశాత్తు కళా విషయాల్లోవాని అధికారికత ఏడ్పుమొగం పెట్టవలసి వచ్చింది.

ఇటువంటి విషయాల్లో అన్నివిధాలైన అధికారమూచెడ్డదే అనేది స్పష్టం. అప్పుడపుడు ప్రజలడుగుతారు. కళాకారులు జీవించేందుకెట్టి ప్రభుత్వం సముచితమైందీ అని. ఈ ప్రశ్నకొకే వుత్తరం వుంది. కళాకారునకనుగుణమగు ప్రభుత్వం ఏదీ అంటే; ఏ ప్రభుత్వమూ లేకుండుటయే. అతనిమీద, అతని కళమీద అధికారం హాస్యాస్పదం. నియంతల క్రింద కళాకారులు అందమైన కళను ఉత్పత్తిచేసిరంటారు. ఇది సరికాదు. కళాకారులు నియంతల వద్దకు భయభ్రాంతులైనపాలితులవలెగాక అద్భుతాలు చేసే సంచారులుగా పోతారు. ఉత్సుకతను కలిగించే వ్యక్తిత్వంగల త్రిమ్మరులుగా పోతారు. ఆతిథ్యమీయబడి, మర్యాదచేయబడి, వారి మానాన్నవారు పోయి కళా సృష్టిచేసేందుకు స్వతంత్రులై ఉంటారు. నియంత పరంగా ఇట్లు చెప్పవచ్చును. అతడొక వ్యక్తి కాబట్టి సంస్కృతి కలిగి ఉండవచ్చు. పెద్దరాకాసి వంటిదైన మూకకు అట్టిదిలేదు. ఒక చక్రవర్తో, రాజో అయినవాడు చిత్రకారునికి కుంచె అందిచ్చుటకు వంగవచ్చును. ప్రజాసామ్యం వంగుట బురదవేయుటకే. అయినా రాజునూ, మూకనూ వేఱుపరచనక్కరలేదు. అధికారమంతా సమానంగా చెడ్డదే.

* 1851 లో లండన్‌లో జరిగిన ప్రథమ వస్తుప్రదర్శనం.

మూడురకాలైన నియంతలుంటారు. దేహంపై నిరంకుశత్వం చూపించే నియంత మొదటివాడు. ఆత్మపై నిరంకుశత్వం చూపించే నియంత రెండవవాడు. దేహాత్మల మీద నిరంకుశత్వం చూపించే నియంత మూడవవాడు. మొదటి నియంత రాజు. రెండవ నియంత మతాధికారి.* మూడవ నియంత ప్రజ. రాజు సంస్కారి కావచ్చు. చాలామంది రాజులు సంస్కారులు. రాజులలో అపాయముంది. వెరొనాలోని విషవిందులోని డాంటే కవినీ, ఫెర్రారా యొక్క పిచ్చివాని గదిలో టాసో కవిని ఇచట అనుకొనవలెను. కళాకారుడు రాజులలో నివసించకుండా ఉండుట మంచిది. మతాధికారులు సంస్కారులు కావచ్చును. చాలా మంది మతాధికారులు సంస్కారులు. మంచి మతాధికారులు ఆలోచనని ద్వేషించిన ఆప్యాయంతోనే చెడ్డమతాధికారులు సౌందర్యాన్ని ప్రేమించినారు. మతాధికార దౌష్ట్యానికి మానవాళి చాలా ఋణపడివుంది. మతాధికారపు మంచితనం మానవాళికి భయం గొలిపే అప్పువంటిది. వాటికన్** తన వాచాలత్వంలోని ఉఱుముల నుంచుకొన్నా, తన మెఱుపులోని ధళుక్కును కోల్పోయింది. కళాకారుడు మతాధికారుల యొద్ద జీవించకుండుట మేలు. సెల్లినీ *** వంటి వానికి చట్టాలూ, అధికారాలు చెల్లవనిపోపు కార్డినలుల ఏకాంత సమావేశంలో చెప్పియుండివాడు. సెల్లినీని ఖైదులో పడవేసింది పోపే. ఖైదులో సెల్లినీ రణకంపరంతో వ్యాధిగ్రస్తుడై ఏ ఏవో మిథ్యా దృశ్యాలు సృష్టించుకొని బంగారు సూర్యుడు తన గదిలో వచ్చినట్లు భావించి, అతని పై మోజుపడి, తప్పించుకొనే ప్రయత్నంలో గోపురం నుండి గోపురానికి ప్రాకుచూ, ఒక తెల్లవారుజామున కన్నులు తిరిగే పై నుండి క్రిందకి పడి కాలు విరుగగొట్టుకున్నాడు. ఒక ద్రాక్షాతోట మాలి ద్రాక్ష ఆకులతో కట్టుకట్టి బండిలో వేసుకొనిపోయి. ఒక సౌందర్యాభిలాషి దగ్గఱకు చేర్చగా, అతడెంతో సేవ చేస్తాడు. మాతాధికారులలో అపాయం వుంది. ప్రజల సంగతో, వారి అధికారమో? వారి గురించీ, వారి అధికారాన్ని గురించీ తగినంత చెప్పుకొన్నాము. వారి అధికారం గ్రుడ్డిది. చెవిటిది, భయంకరం, వికృతం, త్రాసదం, హాస్యాస్పదం ప్రామాదికం, అసభ్యం, ప్రజలతో జీవించుట కళాకారున కసాధ్యం నియంతలు లంచమిస్తారు. ప్రజలూ లంచము నిస్తారు. మృగప్రాయులుగానూ చేస్తారు. అధికారం చెలాయించుమని వారికెవరు చెప్పినారు? వారుండేది బ్రతికి, ఆలకించి ప్రేమించుటకు. వారికెవరో గొప్ప అన్యాయం చేసినారు. తమ పైవాళ్లను అనుకరించి తమను తాము నాశనం చేసికొన్నారు. రాజదండాన్ని తీసికొన్నారు. వారు దానినెలా వుపయోగించవలె? త్రివలయావృత పోపు కిరీటాన్ని తీసికొన్నారు. దాని బరువు నెలా భరించవలె? హృదయం పగిలిన హాస్యగాని వంటివారు. ఆత్మ ఇంకా సాక్షాత్కరించని మత గురువులాంటి వారు. సౌందర్యారాధకులందరూ వీరిపై దయచూపించవలెను. తాము సౌందర్యాన్ని మెచ్చుకోక పోయినా తమకు తామైనా దయ చూపించుకొనవలెను. నిరంకుశత్వ కపటోపాయాన్ని వారికెవరు బోధించినారు?

చెప్పవలసినవి చాలావున్నాయి. సాంస్కృతిక పునరుజ్జీవనమెట్లు గొప్పో చెప్పవచ్చును. అది సాంఘిక సమస్యను పరిష్కరించుటకు ప్రయత్నించలేదు. అటువంటి విషయాలలో సతమతం కాని వ్యక్తిని స్వేచ్ఛగా, సుందరంగా సహజంగా అభివృద్ధి చేందేందుకు వదలి వేసింది. దానికే అందులో గొప్పవారు.

* మూలంలో పోపు ** రోమన్ మతాధికారి, పోపు కేంద్ర స్థానం.

*** ఇతడు పదహారవ శతాబ్దంలో ఇటలీ దేశపు మహాశిల్పి

వ్యక్తిత్వం వున్న కళాకారులు, గొప్పవారు, వ్యక్తిత్వం వున్న మనుషులుండినారు. పదునాలుగవ లూయీ ఆధునిక రాష్ట్రాన్ని రూపొందించి కళాకారుని వ్యక్తిత్వాన్ని ఎట్లుపాడు చేసెనో చెప్పవచ్చును. విసుగు పుట్టించేటట్లు అవే అసహ్య పరిస్థితులను తెచ్చిపెట్టి నియమాలననుసరించుటవల్ల హేయమయినవానిగచేసి, ఫ్రాన్సులో సౌందర్యంలో సంప్రదాయాన్ని కొత్తగా చేసినచక్కని భావప్రకటనా స్వేచ్ఛలను కొత్తపాతల మేలు కలియికను, నాశనం చేసినాడో చెప్పవచ్చును. గతానికి ప్రాముఖ్యం లేదు. భవిష్యత్తుతోనే మనకు పని. ఎందుకంటారా? మనిషి ఏమిగా ఉండివుండకూడదో అది భూతకాలం. మనిషి ఎట్లు ఉండరాదో అది వర్తమానకాలం. కళాకారులేమిగా వుంటారో అది భవిష్యత్తు.

ఇచట ప్రతిపాదించిన ఈ ప్రణాళిక ఆచరణ యోగ్యంకాదనీ, మానవనైజ్ఞానికి వ్యతిరేకమనీ అంటారులెండు. అది పూర్తిగా నిజం. ఇది ఆచరణ యోగ్యంకాదు. మానవ నైజ్ఞానికి విరుద్ధం. అందుకే ఈ ప్రణాళిక అమలు పరుచదగిన విలువ కలది. అందుకే ప్రతి పాదించుటకూడా. ఆచరణ యోగ్యమైన ప్రణాళిక అంటే ఏమి? ఆచరణ యెగ్యమైన ప్రణాళిక అంటే ఇపుడాచరణలో ఉన్న ప్రణాళిక అయినా అవుతుంది. లేదా ప్రస్తుత పరిస్థితులలో అమలు పెట్టగలిగేదైనా అవుతుంది. ప్రస్తుత పరిస్థితులకు వ్యతిరేకంగా కద మనం అభ్యతరం తెలిపేది. ఈ పరిస్థితులనామోదించే ఏ ప్రణాళిక అయినా తప్పు, అవివేకం అయినట్టిది. ఈ పరిస్థితులు మార్చివేయబడుతాయి. మానవనైజం మారుతుంది. మానవ నైజం గురించి మనకు నిజంగా తెలిసిందేమంటే అదిమారుతుందీ అని. మనం నిశ్చయంగా చెప్ప గలిగే గుణం మార్పు. విఫలములయ్యే పద్ధతులేవంటే పెరుగుదల, అభి వృద్ధులపై కాక మానవ నైజం యొక్క శాశ్వతత్వం మీద ఆధారపడినట్టివి. పదునాల్గవ లూయీ చేసిన తప్పేమిటంటే, మానవ నైజం ఎల్లప్పుడూ ఒకటే విధంగా ఉంటుందని భాసించడమే. ఆ తప్పు ఫలితమే ఫ్రెంచి విప్లవం. అది మెచ్చుకోవలసిన ఫలితం. ప్రభుత్వాల తప్పిదాల వల్ల కలిగే ఫలితాలన్నీ మెచ్చుకోదగినవే. వ్యక్తిత్వం, విద్యుక్త ధర్మం గురించిన వాంతిని కలిగించే వ్యర్థాలాపాల వల్లరాదు. విధ్యుక్త ధర్మం, వేరే వాళ్ళకు కావలసిన దానిని మనం చేయడం. ఆత్మ త్యాగం హేయమైన వ్యర్థాలాపాలవల్ల రాదు. అది అటవిక జాతులు తమ అవయవాలని తెగగొట్టుకుంటుండే అలవాటు యొక్క అవశేషమే.

వ్యక్తిత్వం మనిషి నుండి ఏదో కోరుతూరాదు. అది మనిషిలో నుండి సహజంగా తప్పనిసరిగా వస్తుంది. అభివృద్ధి అంతా కేంద్రీకృతమయ్యే బిందువు ఇది. జీవరాశి పెరుగుదలలోని భేద పరిణామమిది. ప్రతి జీవంలోనూ అంతర్గతమైయున్న పరిపూర్ణత ఇది. దీనివైపు జీవరాసులన్నీ పురోగమిస్తాయి. వ్యక్తిత్వం మనిషిపైన ఎలాటి నిర్బంధ ఉంచదు. సరికదా ఏ నిర్బంధాన్నీ సహించవద్దని మనిషికి చెప్తుతుంది. మనుషులను మంచిగా ఉండుడని బలవంత పెట్టదు. వారి మానాన్న వారిని విడిచి పెట్టినపుడే మనుషులు మంచిగా ఉంటారని దీనికి తెలుసు. మనిషి తానే వ్యక్తిత్వాన్ని పెంపొందించు కుంటున్నాడు. ఇపుడు మనిషి అలాగున వ్యక్తిత్వాన్ని పెంపొందించు కుంటున్నాడు. వ్యక్తిత్వం ఆచరణ యోగ్యమా అని అడుగుట పరిణామం* ఆచరణ సాధ్యమా అని అడుగుట వంటిది.

(సశేషం)

* అప్పుడప్పుడే డార్విన్ ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్ధాంతం.



తల దువ్వుకొంటున్న నాగ్నిక (1940)

MISIMI/ మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd.No.H/SD-191/20

